


ప్రజాస్పూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 12-10-2026 | సంపుటి - 31 | సంచిక - 140 | రూ : 4 | పేజీలు: 8

దిల్లీలో ఒక న్యాయం..

రాష్ట్రంలో మరో న్యాయమా?

- ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతోంది
- భాజపా నేతలను నిర్బంధించి గొంతు నొక్కుతోంది: కిషన్‌రెడ్డి



హైదరాబాద్: దిల్లీలో కావాల్సిన ప్రజాస్వామ్య హక్కులు తెలంగాణలో కూడా ఎందుకు ఉండకూడదని కాంగ్రెస్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజాసమస్యలపై భాజపా నాయకులు నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తే మాత్రం తెలంగాణ ప్రభుత్వానికి శాంతిభద్రతలు గుర్తుకొస్తాయా? ఇదెక్కడి ప్రజాస్వామ్యం? దిల్లీలో ఒక న్యాయం.. రాష్ట్రంలో మరో న్యాయమా? అని మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం కేంద్ర మంత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. ''రాహుల్‌గాంధీ దేశమంతా స్వేచ్ఛగా తిరుగుతూ బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ, భారత సైన్యంపై ఆరోపణలు చేస్తున్నారు. అబద్ధాలు ప్రచారం చేసినా.. రాజకీయంగా ఆయన మాట్లాడే హక్కును అడ్డుకోవాలని తరువాయి 2లో



సీఈసీ అండతో

పేదల ఓట్లు తొలగిస్తున్నారు

- గోవా బహిరంగ సభలో మోదీ సర్కారుపై సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజం
- సీఎం ప్రమోద్ రాష్ట్రాన్ని డ్రగ్స్, భూ మాఫియాకు అడ్డాగా మార్చారని ధ్వజం
- వచ్చే ఎన్నికల్లో గోవాలో కాంగ్రెస్ విజయం తథ్యమని ధీమా

హైదరాబాద్: మోదీ ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని పేదల ఓట్లు తొలగిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. గోవా ప్రజలు రెండుసార్లు భాజపాకు ఓటు వేసి గెలిపించారని, మూడోసారి అదే తప్పు చేయొద్దని సూచించారు. చిన్న చిన్న పార్టీలు, స్వతంత్రులకు ఓటు వేస్తే వారు చివరికి భాజపాకే మద్దతిస్తారని, కాంగ్రెస్‌కు మెజారిటీ ఇస్తే సంక్షేమ పాలన అందుతుందన్నారు. గోవాలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అక్కడి కాంగ్రెస్ ఆధ్వర్యంలో గత నెల 22న ''గోయ్ రాఖోన్న్'' పేరుతో పాదయాత్ర మొదలైంది. గోవాలో భూములు, పర్యావరణం, సంస్కృతి, వారసత్వం, స్థానిక గుర్తింపును కాపాడుకోవాలనే నినాదంతో ప్రారంభమైన యాత్ర 27 రోజులపాటు 40 నియోజకవర్గాల తరువాయి 2లో

రైల్వేలో 3,548 ఉద్యోగాలు:

నోటిఫికేషన్ విడుదల



- రైల్వేలో గ్రాడ్యుయేట్ లెవల్ NTPC పోస్టులకు నోటిఫికేషన్
- గూడ్స్ ట్రైన్ మేనేజర్, సీనియర్ క్లర్క్ సహా పలు ఉద్యోగాల భర్తీ
- నవంబర్ 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం
- కంప్యూటర్ ఆధారిత పరీక్షల ద్వారా అభ్యర్థుల ఎంపిక
- 18 నుంచి 33 ఏళ్ల వయసున్న డిగ్రీ అభ్యర్థులు అర్హులు

భారతీయ రైల్వే నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. నాన్‌టెక్నికల్ పాపులర్ కేటగిరీస్ (NTPC గ్రాడ్యుయేట్) కింద 3,548 ఉద్యోగాల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (RRB) ఆదివారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. రైల్వే కార్యకలాపాలు, పరిపాలనలోని వివిధ విభాగాల్లో తరువాయి 2లో

ప్రభుత్వం భయంతోనే

మాపైకి మళ్లించుకుంది


- సీఈసీకి వ్యతిరేక నిరసనను ప్రభుత్వం తమపైకి మళ్లించుకుంటోందని సీజేపీ ఆరోపణ
- గత 72 గంటల్లో దేశంలో ఎమర్జెన్సీని మించిన అరాచకం చూశామన్న అశుతోష్ రంకా
- మోదీ, అమిత్ షా ఆదేశాలతోనే ఎన్నికల సంఘం పనిచేస్తోందని విమర్శ 2లో



పౌరులపై దాడులు సహించబోం

రియాద్ ఘటనపై భారత్ ఆగ్రహం

- రియాద్ ఎయిర్‌పోర్ట్‌పై క్షిపణి దాడిని తీవ్రంగా ఖండించిన భారత్
- ఈ దాడిలో 12 మంది మృతి.. 300 మందికి పైగా గాయాలు
- పౌరుల లక్ష్యంగా దాడులు చేయడం ఆమోదయోగ్యం కాదన్న భారత విదేశాంగ శాఖ
- సౌదీ ప్రభుత్వానికి, ప్రజలకు సంఘీభావం




సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంపై జరిగిన క్షిపణి దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడిలో 12 మంది ప్రాణాలు కోల్పోగా, 300 మందికి పైగా గాయపడ్డారు. పౌరులు, పౌర మౌలిక సదుపాయాలే లక్ష్యంగా ఇలాంటి దాడులు పునరావృతం కావడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. గత దశాబ్ద కాలంలో సౌదీ గడ్డపై జరిగిన అత్యంత తరువాయి 2లో

విజయవాడ ఉత్సవ్ 2.0

ఏపీ ప్రభుత్వానికి ప్రధాని ప్రశంసల లేఖ

- విజయవాడ ఉత్సవ్ 2.0 నిర్వహణపై ప్రధాని మోదీ హర్షం
- దసరా ఉత్సవాలతో పాటు అక్టోబర్ 11 నుంచి వేడుకలు
- ఈ ఉత్సవాలు పర్యాటకానికి కొత్త ఊపునిస్తాయని మోదీ ప్రశంస
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభం



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'విజయవాడ ఉత్సవ్ 2.0' కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ తన అభినందనలు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ఆయన ఒక లేఖ రాశారు. విజయవాడలో ఈ ఉత్సవాలను నిర్వహించడం పట్ల ప్రధాని హర్షం వ్యక్తం తరువాయి 2లో

పాకిస్థాన్‌కు ఇరాన్ వార్నింగ్..

యెమెన్ జోక్యంతో ముప్పు!

- సౌదీ-టర్కీ-పాకిస్థాన్ రక్షణ ఒప్పందంపై ఇరాన్ తీవ్ర అభ్యంతరం
- యెమెన్‌లో జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరిక
- పాకిస్థాన్ మధ్యవర్తి పాత్ర కోల్పోయిందన్న ఇరాన్ చట్టసభ సభ్యులు
- సౌదీకి కాగితపు ఒప్పందాలు భద్రత ఇవ్వలేవని ఎద్దేవా
- ప్రాంతీయ ఉద్రిక్తతలను పెంచిన కొత్త సైనిక కూటమి





శంషాబాద్‌లో ఇండిగో విమానం

ఎమర్జెన్సీ ల్యాండింగ్

- ఢిల్లీ-చెన్నై ఇండిగో విమానంలో అగ్నిప్రమాదం
- హైదరాబాద్‌కు అత్యవసరంగా మళ్లింపు
- ప్రయాణికుడి పవర్ బ్యాంక్ కారణంగా చెలరేగిన మంటలు
- వెంటనే అప్రమత్తమై మంటలార్పిన విమాన సిబ్బంది
- ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నారని వెల్లడి

ఇండిగో విమానంలో ఓ ప్రయాణికుడి పవర్ బ్యాంక్ కారణంగా మంటలు చెలరేగడంతో తరువాయి 2లో

సీఈసీ అండతో పేదల ఓట్లు తొలగిస్తున్నారు

హైదరాబాద్: మోదీ ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని పేదల ఓట్లు తొలగిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. గోవా ప్రజలు రెండుసార్లు భాజపాకు ఓటు వేసి గెలిపించారని, మూడోసారి అదే తప్పు చేయొద్దని సూచించారు. చిన్న చిన్న పార్టీలు, స్వతంత్రులకు ఓటు వేస్తే వారు చివరికి భాజపాకే మద్దతిస్తారని, కాంగ్రెస్‌కు మెజారిటీ ఇస్తే సంక్షేమ పాలన అందుతుందన్నారు. గోవాలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అక్కడి కాంగ్రెస్ అధ్వర్యంలో గత నెల 22న "గోయ్ రాఖోన్" పేరుతో పాదయాత్ర మొదలైంది. గోవాలో భూములు, పర్యావరణం, సంస్కృతి, వారసత్వం, స్థానిక గుర్తింపును కాపాడుకోవాలనే నినాదంతో ప్రారంభమైన యాత్ర 27 రోజులపాటు 40 నియోజకవర్గాల మీదుగా సాగుతోంది. ఆదివారం పాదయాత్రలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి అక్కడి చీఫ్టెన్స్ స్మారకం నుంచి కున్కోలిమ్ బస్టాండు వరకు అక్కడి నేతలతో కలిసి నడిచారు. పాదయాత్రలో, అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. గోవాలో ప్రస్తుత భాజపా పాలనలో డ్రగ్స్ ముఠాలు, భూ మాఫియాలు రాజ్యమేలుతున్నాయని ఆరోపించారు.

*** ఎస్సీ, ఎస్టీ, బీసీల ఓట్ల తొలగింపే లక్ష్యంగా మోదీ అడుగులు**

"దేశంలో ప్రస్తుతం పేదలు, ధనవంతులు అనే రెండు రకాల ప్రజలున్నారు. మోదీ ప్రభుత్వం సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను అడ్డుపెట్టుకుని పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీల ఓట్లను తొలగిస్తోంది. రాహుల్‌గాంధీ ఓట్ల తొలగింపుపై దిల్లీలో పోరాడుతున్నారు. అందుకే రాహుల్‌గాంధీ ప్రతినిధిగా నేను గోవా సభకు వచ్చా. ఇక్కడి పాదయాత్రకు ప్రజల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే..తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు అక్కడ నేను చేసిన పాదయాత్ర గుర్తుకొస్తోంది. గోవాకు మంచిరోజులు రాబోతున్నాయని అర్థమవుతోంది" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మాణిక్‌రావ్ ఠాక్రే రెండేళ్లపాటు శ్రమించి తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషిచేశారని, ఇప్పుడు గోవాలోనూ శ్రమిస్తున్నారని కొనియాడారు.

*** ప్రమోద్ సావంత్ కాదు.. ప్రాపర్టీ సావంత్**

ప్రస్తుత గోవా సీఎం ప్రమోద్ సావంత్‌ను ప్రజలంతా 'ప్రాపర్టీ సావంత్' అని పిలుస్తున్నారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. గోవాలో మళ్లీ భాజపా గెలిస్తే స్థానికులు భూమిని కోల్పోతారన్నారు.

రైల్వేలో 3,548 ఉద్యోగాలు
నోటిఫికేషన్ విడుదల

భారతీయ రైల్వే నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. నాన్‌టెక్నికల్ పాపులర్ కేటగిరీస్ (NTPC గ్రాడ్యుయేట్) కింద 3,548 ఉద్యోగాల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (RRB) ఆదివారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. రైల్వే కార్యకలాపాలు, పరిపాలనలోని వివిధ విభాగాల్లో పనిచేసేందుకు గ్రాడ్యుయేట్లకు ఇది ఒక గొప్ప అవకాశమని ప్రకటనలో పేర్కొంది. ఈ రిక్రూట్‌మెంట్ ద్వారా మొత్తం నాలుగు కేటగిరీలలో పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిలో అత్యధికంగా 2,750 గూడ్స్ ట్రైన్ మేనేజర్ పోస్టులు ఉండగా, సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్ పోస్టులు 371, జూనియర్ అకౌంట్స్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్ పోస్టులు 300, చీఫ్ కమర్షియల్ కమ్ టికెట్ సూపర్‌వైజర్ పోస్టులు 127 ఉన్నాయి. కమర్షియల్, ట్రైన్ ఆపరేషన్స్, అకౌంట్స్, అడ్మినిస్ట్రేషన్ విభాగాల్లో ఈ నియామకాలు చేపట్టనున్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఏడవ కేంద్ర వేతన సంఘం (7th CPC) సిఫార్సుల ప్రకారం వేతనాలు ఉంటాయి. చీఫ్ కమర్షియల్ కమ్ టికెట్ సూపర్‌వైజర్ పోస్టుకు పే లెవల్ 6 కింద రూ.35,400 ప్రారంభ మూల వేతనం లభిస్తుంది. మిగిలిన మూడు కేటగిరీల (గూడ్స్ ట్రైన్ మేనేజర్, జూనియర్ అకౌంట్స్ అసిస్టెంట్, సీనియర్ క్లర్క్) పోస్టులకు పే లెవల్ 5 కింద రూ.29,200 ప్రారంభ మూల వేతనం ఉంటుంది. వీటికి అదనంగా ఇతర అలవెన్సులు కూడా వర్తిస్తాయి. అక్టోబర్ 8న ప్రారంభమైన ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ, నవంబర్ 6 రాత్రి 11:59 గంటలకు ముగుస్తుంది. పరీక్ష ఫీజు చెల్లించడానికి నవంబర్ 8 చివరి తేదీ కాగా, దరఖాస్తులో మార్పులు చేసుకునేందుకు నవంబర్ 9 నుంచి 18 వరకు అవకాశం కల్పించారు. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. 2027 జనవరి 1 నాటికి అభ్యర్థుల వయసు 18 నుంచి 33 ఏళ్ల మధ్య ఉండాలి. నిబంధనల ప్రకారం రిజర్వ్‌డ్ కేటగిరీల అభ్యర్థులకు వయోపరిమితిలో సడలింపులు ఉంటాయి. రెండు దశల కంప్యూటర్ ఆధారిత పరీక్ష (CBT), ద్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అయితే, జూనియర్ అకౌంట్స్ అసిస్టెంట్, సీనియర్ క్లర్క్ పోస్టులకు తప్పనిసరి అయిన కంప్యూటర్ బేస్డ్ టైపింగ్ స్కిల్ టెస్ట్‌ను ఈసారి మినహాయించినట్లు రైల్వే తెలిపింది. ఉద్యోగంలో చేరిన తర్వాత వారి టైపింగ్ నైపుణ్యాన్ని పరిశీలిస్తారని నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. ఖాళీల పూర్తి వివరాలు, అర్హతలు, రిజర్వేషన్ల కోసం అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ rrb.indianrailways.gov.in ను సందర్శించాలని రైల్వే శాఖ సూచించింది.

దిల్లీలో ఒక న్యాయం.. రాష్ట్రంలో మరో న్యాయమా?

హైదరాబాద్: దిల్లీలో కావాల్సిన ప్రజాస్వామ్య హక్కులు తెలంగాణలో కూడా ఎందుకు ఉండకూడదని కాంగ్రెస్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజాసమస్యలపై భాజపా నాయకులు నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తే మాత్రం తెలంగాణ ప్రభుత్వానికి శాంతిభద్రతలు గుర్తుకొస్తాయా? ఇదెక్కడి ప్రజాస్వామ్యం? దిల్లీలో ఒక న్యాయం.. రాష్ట్రంలో మరో న్యాయమా? అని మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం కేంద్ర మంత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. "రాహుల్‌గాంధీ దేశమంతా స్వేచ్ఛగా తిరుగుతూ బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ, భారత సైన్యంపై ఆరోపణలు చేస్తున్నారు. అబద్ధాలు ప్రచారం చేసినా.. రాజకీయంగా ఆయన మాట్లాడే హక్కును అడ్డుకోవాలని మా ప్రభుత్వం ఏనాడూ ప్రయత్నించలేదు. తెలంగాణలో మాత్రం ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే కాంగ్రెస్ జీర్ణించుకోవడం లేదు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుతో సహా నేతలను ఎక్కడికక్కడ గృహ నిర్బంధం చేస్తూ గొంతు నొక్కేస్తోంది. ప్రభుత్వ తీరుతో ఇబ్బందులు పడుతున్న ప్రజలను పరామర్శించేందుకు వెళ్తుంటే భాజపా నేతలను ఇళ్ల నుంచి బయటకు రానివ్వడం లేదు. కానిస్టేబుల్ నియామకాలపై ధర్నా, రైతు గోసభాజపా భరోసా, సింగరేణి భరోసా యాత్ర, చలో గాంధీభవన్, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విడుదల.. ఇలా చాలా అంశాల్లో భాజపా నేతలపై నిర్బంధాలను తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసింది" అని కిషన్‌రెడ్డి విమర్శించారు.

*** కాంగ్రెస్ పాలనకు ఎమ్మెల్సీ ఎన్నికలు రెఫరెండం**

కాచిగూడ, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వ మూడేళ్ల పాలనకు త్వరలో జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రెఫరెండమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల హామీల అమలులో విఫలమైన రేవంత్ సర్కార్ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. ఆదివారం హైదరాబాద్ అంబర్‌పేటలో 'ఎమ్మెల్సీ, జీహెచ్ఎంసీ ఎన్నికలు' అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో భాజపా విజయం ఖాయమన్నారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం జీహెచ్ఎంసీ ఎన్నికల నిర్వహణకు వెనుకడుగు వేస్తుందని విమర్శించారు. సమావేశంలో మాజీ మంత్రి కృష్ణాయాదవ్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.గౌతంరావు, కార్యదర్శి డా.ఒ.శ్రీనివాస్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పౌరులపై దాడులు సహించబోం: రియాద్ ఘటనపై భారత్ ఆగ్రహం

సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంపై జరిగిన క్షిపణి దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడిలో 12 మంది ప్రాణాలు కోల్పోగా, 300 మందికి పైగా గాయపడ్డారు. పౌరులు, పౌర మౌలిక సదుపాయాలే లక్ష్యంగా ఇలాంటి దాడులు పునరావృతం కావడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. గత దశాబ్ద కాలంలో సౌదీ గడ్డపై జరిగిన అత్యంత భయానక దాడిగా దీనిని భావిస్తున్నారు. రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దేశీయ విమానాల కోసం కేటాయించిన టెర్మినల్స్ 3, 4 ఉన్న ప్రాంతంలో ఈ క్షిపణి దాడి జరిగింది. అక్టోబర్ 10న జరిగిన ఈ దారుణ ఘటనతో పాటు గత కొన్ని రోజులుగా రియాద్ విమానాశ్రయంపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. 'పౌరులపై దాడులను తక్షణమే నిలిపివేయాలి' అని ఆ ప్రకటనలో డిమాండ్ చేసింది. సౌదీ అరేబియా సార్వభౌమత్వాన్ని కాపాడుకునే విషయంలో ఆ దేశ ప్రజలకు, ప్రభుత్వానికి భారత్ అండగా నిలుస్తుందని తెలిపింది. ఈ ప్రాంతంలో వీలైనంత త్వరగా శాంతి, సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆకాంక్షించింది. ఈ దాడి వెనుక యెమెన్‌కు చెందిన ఇరాన్ మద్దతున్న హౌతీ తిరుగుబాటుదారుల హస్తం ఉందని సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు ఆరోపించాయి. మృతుల్లో సౌదీ, బంగ్లాదేశ్, పాలస్తీనా, అమెరికా, ఈజిప్ట్, జోర్డాన్, సిరియా, సూడాన్ పౌరులు ఉన్నారు. ఈ వారంలో రియాద్ విమానాశ్రయంపై ఇది మూడో దాడి కావడం గమనార్హం. దాడి కారణంగా శనివారం విమానాశ్రయ కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేసి, విమానాలను దారి మళ్లించారు.

ప్రభుత్వం భయపడుతోంది.. అందుకే సీఈసీపై పోరాటాన్ని తమపైకి మళ్లించుకుంది: సీజేపీ

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా తాము చేస్తున్న శాంతియుత నిరసనలను చూసి కేంద్ర ప్రభుత్వం భయపడుతోందని, అందుకే ఈ పోరాటాన్ని మోదీ, అమిత్ షాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంగా మార్చుకుందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తీవ్రంగా ఆరోపించింది. ముందస్తు అరెస్టు కింద అదుపులోకి తీసుకున్న తర్వాత విడుదలైన కొన్ని గంటలకే, సీజేపీ సహ కన్వీనర్ అశుతోష్ రంకా ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా అశుతోష్ రంకా మాట్లాడుతూ, "గత 72 గంటల్లో దేశం తీవ్రమైన అరాచక పాలనను చూసింది. నిర్దేశిత ప్రాంతంలో శాంతియుతంగా నిరసన తెలియజేయాలనుకున్న వేలాది మందిని దేశవ్యాప్తంగా అదుపులోకి తీసుకున్నారు. నిన్న మమ్మల్ని విమానం నుంచి కిడ్నాప్ చేసినంత పని చేశారు. పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, మేము మా తల్లిదండ్రుల నుంచి విన్న 1975 ఎమర్జెన్సీ కథలను కూడా ఈ 72 గంటల పరిణామాలు మించిపోయాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా వల్లే ఈ దుస్థితి దాపురించిందని ఆయన ఆరోపించారు. "ఒక విషయం స్పష్టమైంది. ఎన్నికల సంఘం, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ప్రారంభమైన ఈ పోరాటాన్ని ప్రధాని మోదీ, అమిత్ షాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంగా మార్చారు" అని ఆయన పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన ఎన్నికల సంఘం, పూర్తిగా ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాల కనుసన్నల్లోనే పనిచేస్తోందని, కేవలం బీజేపీని ఎన్నికల్లో గెలిపించడమే లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీపేమ్కె కుటుంబంలో జరిగిన విషాదం పట్ల ఢిల్లీ పోలీసులు వ్యవహరించిన తీరుపై అశుతోష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం అభిజీత్ నాయనమ్మ మరణవార్త తెలిసినప్పుడు కూడా ఢిల్లీ పోలీసులు అత్యంత అమానవీయంగా ప్రవర్తించారని, కెమెరాలు, మైక్రోఫోన్లతో వచ్చి ఆ విషాదాన్ని కూడా ఒక ప్రదర్శనగా మార్చడానికి ప్రయత్నించారని ఆరోపించారు. "తన తల్లిదండ్రులు గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని, వారికి సులభంగా ఆందోళనకలుగుతుందని, అందుకే తన కజిన్‌తో మాట్లాడనివ్వాలని అభిజీత్ వేడుకున్నా ఢిల్లీ పోలీసులు కనికరించలేదు" అని రంకా తెలిపారు. తాను తన నాయనమ్మ అంత్యక్రియల కోసం మహారాష్ట్రలోని సొంత ఊరికి వెళుతున్నానని, అయితే సీజేపీ వెనక్కి తగ్గదని, బెదిరింపులకు భయపడదని అభిజీత్ దీపేమ్కె స్పష్టం చేశారు. అభిజీత్ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ దుఃఖ సమయంలో తామంతా అతడికి అండగా నిలుస్తామని రంకా అన్నారు. ఈ పోరాటంలో తమకు మద్దతుగా నిలిచిన ప్రతిపక్ష నేతలకు సీజేపీ కృతజ్ఞతలు తెలిపింది. "నలుగురు మాజీ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ, మాణిక్ సర్కార్, పినరయి విజయన్ వీధుల్లోకి వచ్చి యువతతో కలిసి నిలబడటం ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి వారు చేస్తున్న పోరాటానికి నిదర్శనం. వారికి మా హృదయపూర్వక ధన్యవాదాలు" అని రంకా పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఏ వంటి వామపక్ష విద్యార్థి సంఘాల సభ్యులను కూడా పోలీసులు అత్యంత క్రూరంగా అదుపులోకి తీసుకున్నారని ఆయన ఆరోపించారు. "ఈ పోరాటం ఇప్పుడే మొదలైంది. దీనిని ఒక యుద్ధంగా మార్చినందుకు ప్రభుత్వం సిగ్గుపడాలి" అని ఆయన వ్యాఖ్యానించారు.

ఢిల్లీచెన్నై ఇండిగో విమానంలో కలకలం..
శంషాబాద్ ఎయిర్ పోర్టులో ఎమర్జెన్సీ ల్యాండింగ్

ఇండిగో విమానంలో ఓ ప్రయాణికుడి పవర్ బ్యాంక్ కారణంగా మంటలు చెలరేగడంతో తీవ్ర కలకలం రేగింది. విమానం గాల్లో ఉండగా ఈ ఘటన జరగడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన విమాన సిబ్బంది మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన కారణంగా విమానాన్ని హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయానికి అత్యవసరంగా మళ్లించారు. వివరాల్లోకి వెళితే, ఆదివారం మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో ఇండిగో విమానం 6E6115 ఢిల్లీ నుంచి చెన్నైకి బయలుదేరింది. విమానం గాల్లో ఉండగా, ఓవర్ హెడ్ లగేజీ కంపార్ట్‌మెంట్‌లో ఉన్న ఓ ప్రయాణికుడి పవర్ బ్యాంక్ నుంచి అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. పొగలు రావడాన్ని గమనించిన క్యాబిన్ సిబ్బంది వెంటనే స్పందించి, విమానంలో అందుబాటులో ఉన్న భద్రతా పరికరాలతో మంటలను అదుపులోకి తెచ్చారు. ముందుజాగ్రత్త చర్యగా, పైలట్ విమానాన్ని సమీపంలోని హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (RGIA) వైపు మళ్లించారు. విమానం శంషాబాద్‌లో సురక్షితంగా ల్యాండ్ అవ్వడంతో ప్రయాణికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణికులు, సిబ్బంది అంతా క్షేమంగా ఉన్నారని ఇండిగో సంస్థ ప్రకటించింది. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. అగ్నిప్రమాదానికి దారితీసిన కచ్చితమైన కారణాలను, ఆ పవర్ బ్యాంక్ ఏ కంపెనీకి చెందినది అనే వివరాలను సేకరిస్తున్నారు. కాగా, విమాన ప్రయాణాల్లో లిథియంఅయాన్ బ్యాటరీలు, పవర్ బ్యాంకుల వల్ల అగ్నిప్రమాదాలు జరిగే ప్రమాదం ఉన్నందున, వీటిని కేవలం క్యాబిన్ బ్యాగేజీలోనే ఉంచాలని, విమానంలో ఛార్జింగ్ చేయరాదని విమానయాన నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నిబంధనల ప్రాముఖ్యతను తాజా ఘటన మరోసారి గుర్తుచేసింది.

విజయవాడ ఉత్సవ్ 2.0: ఏపీ ప్రభుత్వానికి ప్రధాని ప్రశంసల లేఖ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'విజయవాడ ఉత్సవ్ 2.0' కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ తన అభినందనలు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ఆయన ఒక లేఖ రాశారు. విజయవాడలో ఈ ఉత్సవాలను నిర్వహించడం పట్ల ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక జీవనంలో విజయవాడకు ఒక ప్రత్యేక స్థానం ఉందని ప్రధాని తన లేఖలో పేర్కొన్నారు. ఈ ఉత్సవాలు పారిశ్రామికవేత్తలకు కొత్త అవకాశాలు కల్పిస్తాయని, పర్యాటక రంగానికి తాజా ఉత్తేజాన్ని ఇస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. విజయవాడ ప్రజలకు, వారి సాంస్కృతిక వారసత్వానికి మధ్య ఉన్న బంధాన్ని ఈ వేడుకలు మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. దసరా ఉత్సవాలకు అనుగుణంగా ఇవాళ్టి (అక్టోబర్ 11) నుంచి విజయవాడ ఉత్సవ్ 2.0 వేడుకలు ప్రారంభం కానున్నాయి. నగరంలోని మకినేని బసవపున్నయ్య స్టేడియం, పున్నమి ఘాట్ సహా పలు ప్రాంతాలు ఈ ఉత్సవాలకు వేదికలుగా నిలవనున్నాయి. నగరం సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పడంతో పాటు పర్యాటకాన్ని ప్రోత్సహించడం, స్థానిక ఆర్థిక అవకాశాలను మెరుగుపరచడం ఈ ఉత్సవాల ముఖ్య ఉద్దేశం. ఈ వేడుకలను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రారంభించనున్నారు. ఈ ఉత్సవాలలో భాగంగా జాతీయ సరస్ మేళాను కూడా నిర్వహిస్తున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసే స్టాళ్లు ఈ మేళాలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఆధ్యాత్మిక పర్యాటకంపై దృష్టి పెట్టడంతో పాటు స్థానిక కళాకారులకు మద్దతు ఇవ్వడమే ఈ ఉత్సవాల ప్రధాన లక్ష్యమని ఎంపీ కేశినేని శివనాథ్ సహా నిర్వాహకులు చెబుతున్నారు. ప్రధాని నుంచి ప్రశంసలు రావడంతో ఈ కార్యక్రమంపై మరింత ఆసక్తి నెలకొంది.



పాకిస్థాన్‌కు ఇరాన్ వార్నింగ్.. యెమెన్ జోక్యంతో ముప్పు!

సౌదీ అరేబియా, టర్కీలతో కలిసి పాకిస్థాన్ ఏర్పాటు చేసిన రక్షణ ఒప్పందం కార్యాచరణలోకి రావడంపై ఇరాన్ తీవ్ర స్వరంతో స్పందించింది. యెమెన్ విషయంలో జోక్యం చేసుకుంటే ప్రాంతంపై తీవ్ర దుష్ప్రభావాలు ఉంటాయని హెచ్చరించింది. ముఖ్యంగా, అమెరికాతో చర్చల విషయంలో మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్ ఈ కూటమిలో చేరడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇరాన్ ఇంటర్నేషనల్ కథనం ప్రకారం, సౌదీ మౌలిక సదుపాయాలపై హౌతీల క్షిపణి, డ్రోన్ దాడులు పెరగడంతో, ఈ త్రైపాక్షిక ఒప్పందం అక్టోబర్ 5 నుంచి కార్యాచరణ దశలోకి ప్రవేశించింది. సౌదీ అరేబియాకు మద్దతుగా టర్కీ, పాకిస్థాన్ చర్యలు ప్రారంభించాయి. ఈ నేపథ్యంలో, వేలాది మంది పాకిస్థాన్ సైనికులను సౌదీకి పంపవచ్చనే వార్తలపై ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ స్పందించారు. "మేము కూడా ఈ వార్తను విన్నాం. అది నిజం కాదని ఆశిస్తున్నాం. యెమెన్ విషయంలో ఏ దేశం జోక్యం చేసుకున్నా ప్రాంతంలో అవాంఛనీయ పరిణామాలు తప్పవు" అని ఆయన స్పష్టం చేశారు. అయితే, టర్కీ కంటే పాకిస్థాన్‌పైనే ఇరాన్ తన విమర్శలను ఎక్కువగా కేంద్రీకరించింది. టెహ్రాన్, వాషింగ్టన్ మధ్య మధ్యవర్తిగా ఇస్లామాబాద్ పోషిస్తున్న ప్రముఖ పాత్రే ఇందుకు కారణం. ఇరాన్ పార్లమెంట్ సభ్యుడు అహ్మద్ నదేరి మాట్లాడుతూ, "యెమెన్ ప్రజలకు వ్యతిరేకంగా జరుగుతున్న యుద్ధంలో సౌదీ పక్షాన పాకిస్థాన్ చేరడం.. ఆ దేశం ఇకపై మధ్యవర్తిగా కాకుండా, ప్రాంతీయ జోక్యదారుగా

సంజయ్ గాంధీ నగర్ లో కౌసర్ హాస్పిటల్ ప్రారంభం



కుత్బుల్లాపూర్,ప్రజాస్ఫూర్తి: సూరారం డివిజన్ సంజయ్ గాంధీ నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన "కౌసర్ హాస్పిటల్" ను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూపేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ "కౌసర్ హాస్పిటల్" యాజమాన్యం మంచి పేరు గడించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ వాహేద్, డాక్టర్ షాకినా కాసర్, మాజీ కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, సురేష్ రెడ్డి, జగన్, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, పలు డివిజన్లకు చెందిన సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ.. లక్ష్యసాధన

* 32 జిల్లాల నుంచి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ క్రీడాకారులు
* పోటీలను ప్రారంభించిన ఎంపీ గొడం నగేష్



కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా,ప్రజా స్ఫూర్తి:క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, పట్టుదల, స్నేహభావం, లక్ష్యసాధనను నేర్పుతాయని ఎంపీ గోడం నగేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆదర్శ క్రీడా పాఠశాలలో నిర్వహిస్తున్న 12వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2026 పోటీలను శనివారం ఆయన కలెక్టర్ కె.హరిత,ఎస్పీ నితిక పంత్, ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి, క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి, జెండా ఊపి పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలోని 32 జిల్లాల నుంచి క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా ఈ పోటీలు జరగడం సంతోషకరమన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ పట్టుదలతో ముందుకు సాగాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు.రాష్ట్రస్థాయి పోటీలు తమ ప్రతిభను నిరూపించుకోవడానికి మంచి వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు.కలెక్టర్ కె.హరిత మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సమయపాలన, జట్టుగా పనిచేసే నైపుణ్యాలు పెంపొందుతాయని తెలిపారు. క్రీడాకారులు నిరంతరం సాధన చేస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాస్ఫూర్తితో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులకు జ్ఞాపికలు, బహుమతులు, పతకాలు, ధ్రువపత్రాలు అందజేశారు. పి.కౌశిక్ ప్రథమ స్థానం, హిమంత్ రావు ద్వితీయ స్థానం, ప్రణీత్ తృతీయ స్థానం సాధించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎం.శేకు, డీసీసీ ప్రతినిధి ఆత్రం సుగుణ, అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధి కొట్నాక విజయ్, వివిధ శాఖల అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు, నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బోథ్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి కాంగ్రెస్ ఘన సన్మానం

* ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయులది కీలక పాత్ర



బోథ్, ప్రజాస్ఫూర్తి: బోథ్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానం నిర్వహించారు. బోథ్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దాసరి పురుషోత్తం, గౌరవ అధ్యక్షులు నమలి కొండ సంతోష్ కుమార్ లతో పాటు సభ్యులు శర్మ, షేక్ అలీ, ఈర్ల ఎర్రన్న లను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మెరుగు భోజన్న, ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, అచ్యుత్ నంద్ రెడ్డి, మాజీ సర్పంచ్ విశాల దాస్ తదితరులు మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలకు చేరవేస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణలో మీడియా ముఖ్యమైన పాత్ర పోషిస్తోందని అన్నారు.ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తూ, ప్రజల గొంతుకగా నిలవాలని ఆకాంక్షించారు. నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


గోశాల నిర్మాణనికి భూమి పూజ చేసిన దేగాం సర్పంచ్



ప్రజాస్ఫూర్తి, భైంసా:నిర్మల్ జిల్లా భైంసా మండలం లోని దేగాం గ్రామం లో వివిజీ రాంజీ పథకం లో ఆదివారం 10 లక్షల రూపాయల నిధులతో నిర్మించనున్న గోశాల నిర్మాణనికి దేగాం సర్పంచ్ సిరం సుష్మరెడ్డి భూమి పూజ చేశారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ గోశాలల నిర్మాణనికి నిధులు మంజూరు చేయించినందుకు కృతజ్ఞతలు చెప్పారు.. దశల వారిగా గ్రామ అభివృద్ధే తన ధ్యేయమన్నారు..గ్రామస్తులందరి సహకారం తో గ్రామం లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు..కార్యక్రమం లో ఉప సర్పంచ్ శివాజీ తో పాటు వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు..

ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి నా వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయి

* బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్



కుత్బుల్లాపూర్,ప్రజాస్ఫూర్తి:ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి నా వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు.తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీలో ఇటీవల జరిగిన కార్మిక సంఘాల ఎన్నికల్లో జీడిమెట్ల డిపో నుంచి బరిలోకి దిగిన ఎంప్లాయిస్ యూనియన్ ఈఎంయూ ఎన్ఎంయూ కూటమి ప్రత్యర్థి కూటమి అయినా ఈడబ్ల్యూయూ టిడబ్ల్యూయూ ఐఎన్టియుసి కూటమిపై 68 ఓట్ల మెజార్టీతో గెలుపొందగా జలిగం రాకేష్ గౌరవ అధ్యక్షులుగా గెలిచారు. ఆదివారం ఉదయం కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద జీడిమెట్ల డిపోకు చెందిన ఎంప్లాయిస్ యూనియన్ ఈఎంయూ ఎన్ఎంయూ కూటమి సభ్యులు గౌరవాధ్యక్షులు జలిగం రాకేష్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ కార్మిక సంఘాల ఎన్నికలలో గెలుపు కార్మికుల సంక్షేమం పట్ల నూతన కమిటీ సభ్యులపై మరింత బాధ్యతను పెంచుతుందన్నారు. కార్మిక సంక్షేమం విషయంలో నూతన కమిటీకి నావంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. అనంతరం గౌరవ అధ్యక్షులుగా ఎన్నికైన జలిగం రాకేష్ ను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో డిపో సెక్రెటరీ కోల రాజేష్, గ్రేటర్ హైదరాబాద్ ప్రెసిడెంట్ గోవర్ధన్ రాపోలు, బాబు, అధ్యక్షులు జ్ఞానేశ్వర్, జేఏసీ చైర్మన్ రాజేందర్ రెడ్డి, సభ్యులు పాషా, అంకం రావు, బిఎల్.నారాయణ, మహిళా నాయకురాలు క్రిష్ణా భాయ్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతులు రెండో పంట వేసి ఇబ్బంది పడొద్దు

* ఎల్‌నినో ప్రభావం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
* రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర జల వనరుల సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఇప్పటికే రైతులు సాగు చేసిన తొలి పంటను కాపాడేందుకు ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో రెండో పంట వేసి ఇబ్బందులు పడొద్దని విజ్ఞప్తి చేశారు. ఆదివారం కూసుమంచి మండలంలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఐటీడీఏ నిధులు రూ.1.63 కోట్లతో మంగలితండా-దుబ్బతండా మధ్య నిర్మించనున్న బీటీ రహదారి పనులకు, జుజ్జుల్ రావుపేటలో రూ.45 లక్షలతో చేపట్టనున్న ఓవర్‌హెడ్ ట్యాంకు, పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు. మంగలితండాలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. అలాగే.. హటియాతండాలో ఇటీవల మృతి చెందిన మాజీ ఎంపీటీసీ బదావత్ వీరన్న తండ్రి బాషా కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాల శ్రీకార సభల్లో మంత్రి ప్రసంగించారు.

* రూ.15 పెట్టినా విద్యుత్తు దొరకడం లేదు

గతంలో యూనిట్ విద్యుత్తు రూ.7, రూ.8కు లభించేదని, ప్రస్తుతం విద్యుత్తు కొరత తీవ్రంగా ఉందని మంత్రి పొంగులేటి ఆవేదన వ్యక్తం చేశారు. యూనిట్‌కు రూ.15 చెల్లించి కొనుగోలు చేయాలన్నా దేశంలో విద్యుత్తు లభించని పరిస్థితులు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. భూగర్భ జలమట్టాలు క్రమంగా పడిపోతున్న నేపథ్యంలో భవిష్యత్తులో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ఇప్పటి నుంచే పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

* రెండో పంట సాగు వద్దు..

ఎల్‌నినో ప్రభావం తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో రైతులు రెండో పంట సాగు చేయవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే వేసిన తొలి పంటను కాపాడేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. రెండో పంట వేసి, నీరు అందక పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయే పరిస్థితి తెచ్చుకోవద్దని, ప్రభుత్వ సూచనలను పాటించాలని కోరారు.

* కేంద్రాన్ని కలిసి ప్రత్యేక ప్యాకేజీ కోరతాం

ఎల్‌నినో ప్రభావం దక్షిణాది రాష్ట్రాలపై తీవ్రంగా ఉందని పొంగులేటి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర మంత్రివర్గ బృందం ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులను కలిసి తెలంగాణలో నెలకొన్న పరిస్థితులను వివరించనున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి అధిక ఆర్థిక సహాయం అందించేలా ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, జీరామ్‌జీ పథకం కింద గ్రామాల్లో అదనపు పనిదినాలు కల్పించాలని కేంద్రాన్ని అభ్యర్థించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ దివాకర.టీఎస్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బజ్జూరి వెంకటరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ. హఫీజుద్దీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు,పలువురు సర్పంచులు, పాల్గొన్నారు.

దశాబ్దం క్రితం పడిన ఒక అడుగు నేటికీ కొనసాగుతున్న కృతజ్ఞత



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ జిల్లా ఆవిర్భవించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా,జిల్లా ఏర్పాటుకు కృషి చేసిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు కు బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా కృతజ్ఞతలు తెలిపాయి.మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు బేతోలు గ్రామంలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో దశాబ్ది వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. 2016 అక్టోబర్ 11న మహబూబాబాద్ నూతన జిల్లాగా ఏర్పడిన చారిత్రక దినాన్ని గుర్తు చేసుకుంటూ, నాయకులు, కార్యకర్తలు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా మహబూబాబాద్‌ను జిల్లాగా ప్రకటించి, ప్రజల చిరకాల కలను సాకారం చేసిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందని అన్నారు.ఆయన పాలనలో జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని భూక్యా రాంజీ, షేక్ ఖాదర్ బాబా, గద్దపాటి వేణు, ఏర్పుల హుస్సేన్, షేక్ గౌస్,పోలేపొంగు సర్వయ్య, సదనబోయిన శ్రీకాంత్,గుండెపల్లి నవీన్,జింక ఎల్లయ్య,ఆదిముల ప్రతాప్, పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు

* ఢిల్లీలో విద్యార్థి సంఘాల నాయకుల అరెస్టుల ఖండించిన ఏఐ పిఎస్ యు నాయకులు



ప్రజాస్ఫూర్తి,భైంసా:నిరంకుశ పాలకుల నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని ఏఐపీఎస్‌యూ నిర్మల్ జిల్లా కార్యదర్శి గడపాలి పరమేష్ అన్నారు. ఢిల్లీలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం, గృహ నిర్బంధంలో ఉంచడం,అక్రమంగానిర్బంధించడాన్ని ఏఐపీఎస్‌యూ నిర్మల్ జిల్లా కమిటీ తరఫున తీవ్రంగా ఖండించారు. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని, ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తోందని తాము భావిస్తున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను రద్దు చేయాలని, ఎన్నికల సంఘంలో సమగ్ర సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 10న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వామపక్ష విద్యార్థి సంఘాలు 'చలో ఢిల్లీ' కార్యక్రమానికి పిలుపునిచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు విద్యార్థి సంఘాల నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని పేర్కొన్నారు. పోలీసు బలగాలతో విద్యార్థుల గొంతుకలను నొక్కాలని చూస్తే ఉద్యమాలు మరింత బలపడతాయని హెచ్చరించారు. రాజ్యాంగ హక్కులు, ప్రజాస్వామ్య విలువలకు భంగం కలిగించే చర్యలను విద్యార్థి లోకం నిరంతరం ప్రశ్నిస్తుందని స్పష్టం చేశారు.ఎన్ని నిర్బంధాలు విధించినా, ఎన్ని అక్రమ అరెస్టులు చేసినా ప్రజా ఉద్యమాలను ఆపలేరని అన్నారు.అరెస్టు చేసిన విద్యార్థి సంఘాల నాయకులందరినీ వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువజనుల నిరసనలను ఎదుర్కోవాల్సి వస్తుందని పాలకులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు గడపాలే పరమేశ్వర్, వాగ్మారే రుద్ర ప్రతాప్, జవారే రాహుల్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ జిల్లా పర్యటనకు రావాలని రాజ్యసభ సభ్యుడికి ఆహ్వానం



ప్రజాస్ఫూర్తి, భైంసా: నిర్మల్ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సయ్యద్ హైదర్ ఢిల్లీలో ఆ పార్టీ రాజ్యసభ సభ్యులు సంజయ్ సింగ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.ఈ సమావేశంలో తెలంగాణలో, ముఖ్యంగా నిర్మల్ జిల్లాలో పార్టీ విస్తరణ, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం,ప్రజా సమస్యలపై పోరాటాలను ఉధృతం చేయడం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. జిల్లాలో ఆప్ సిద్ధాంతాలను, సంక్షేమ ఎజెండాను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు రూపొందించిన కార్యాచరణను ఎంపీకి వివరించారు.ఈ సందర్భంగా నిర్మల్ జిల్లాలో పర్యటించి,పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయాల్సిందిగా సంజయ్ సింగ్‌ను సయ్యద్ హైదర్ ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ భేటీతో నిర్మల్ జిల్లాలో ఆమ్ ఆద్మీ పార్టీ రాజకీయ కార్యకలాపాలు మరింత ఊపందుకోనున్నాయని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

ఆదివాసీ గ్రామాల సమగ్ర అభివృద్ధికి విద్య ఎంతో కీలకం



ప్రజాస్ఫూర్తి, ఆదిలాబాద్ జిల్లా :ఆదివాసీ గ్రామాల సమగ్ర అభివృద్ధికి విద్య ఎంతో కీలకమని, గిరిజన యువత జీవితాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి చదువే బలమైన ఆయుధమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బాలబాలికలు విద్యపై ప్రత్యేక దృష్టి సారించి, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.సిరికొండ మండలం కోసుపటేల్ గూడ గ్రామంలో ఇంద్రవెల్లి అమరవీరుడు పెందూర్ మచ్చు కుటుంబ సభ్యులైన దుర్గాబాయి-ఆనంద్ రావు దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం గ్రామంలో కల్వర్టు, ఇతర మరమ్మత్తుల పనులకు భూమిపూజ చేశారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ ప్రాథమిక పాఠశాల భవనాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కోసుపటేల్ గూడలో గతంలో ఎల్ 3గా ఉన్న లబ్ధిదారుల జాబితాను ఎల్ 1కు మార్పు చేయించి ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీలు, వీపోలు, అంగన్‌వాడీ కేంద్రాలకు మంజూరైన నూతన భవనాల నిర్మాణాలతో పాటు పెండింగ్ పనులను వేగవంతం చేయాలన్నారు. బాలికలను చిన్న వయసులోనే చదువుకు దూరం చేయడం, బాల్యవివాహాలు చేయడం సరికాదని, వారి భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్పష్టం చేశారు. దసరా సెలవుల అనంతరం విద్యార్థులు తప్పనిసరిగా పాఠశాలలు, గురుకులాలకు హాజరు కావాలని, సెలవు రోజుల్లో సమయాన్ని వృథా చేయకుండా హోంవర్క్, ప్రాజెక్టులను పూర్తి చేసుకుంటూ క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించినప్పుడే కుటుంబాలు, గ్రామాలు, సమాజం అభివృద్ధి చెందుతాయని అన్నారు. నీటి వనరులను కాపాడుకోవడం ద్వారా భవిష్యత్తులో నీటి కొరతను తగ్గించవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ శివరామ్, తహశీల్దార్ అరవింద్ కుమార్, ఎంపీడీవో రఘువీర్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ డీఈ రమేష్, సర్పంచ్ గణపతి, నాయకులు ఆడే గజేందర్, స్థానిక సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాడ వాడలా మారుమ్రోగుతున్న అమ్మ నామస్మరణ



ప్రజాస్ఫూర్తి, ఆదిలాబాద్ జిల్లా :జిల్లా లో వాడవాడలా దుర్గా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభ అయ్యాయి. మొదటి రోజు అమ్మవారి ప్రతిష్టాపన పూర్తి కాగా అమ్మ వారు బాలాత్రిపుర సుందరి అవతారంలో దర్శనం ఇచ్చింది. చిన్న పెద్ద అనే తేడా లేకుండా భవానీ మాలలు ధరించి అమ్మవారి సేవలో భక్తులు తరలిస్తున్నారు.

జీజీహెచ్‌లో సీటీ స్కాన్ సేవలకు చర్యలు

*** ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్‌కు సూపరింటెండెంట్ వినతి**

కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా,ప్రజాస్ఫూర్తి:జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో సీటీ స్కాన్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ కిరణ్ (ప్రొఫెసర్ జనరల్ మెడిసిన్) చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా తెలంగాణ ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్స్) టి. మధుసూదన్‌ను హనుమకొండలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. సీటీ స్కాన్ యంత్రం వినియోగంలోకి రావాలంటే ఆసుపత్రి ఆవరణలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతోపాటు అవసరమైన నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉందని వివరించారు.

సమస్య పరిష్కారానికి స్పందన

జీజీహెచ్ సూపరింటెండెంట్ విజ్ఞప్తి పై డైరెక్టర్ మధుసూదన్ వెంటనే స్పందించారు. ఎస్ఈ ఉత్తం జాడేతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో ఆసుపత్రిలో సీటీ స్కాన్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు మార్గం సుగమం కానుంది.



జిల్లా ప్రజలకు ప్రయోజనం

జీజీహెచ్‌లో సీటీ స్కాన్ సేవలు ప్రారంభమైతే జిల్లా ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. వివిధ అనారోగ్య సమస్యలను గుర్తించేందుకు అవసరమైన పరీక్షలను స్థానికంగానే చేయించుకునే అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం ఈ పరీక్షల కోసం ఇతర ప్రాంతాల్లోని ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి తప్పనుంది. దీంతో రోగులకు ప్రయాణ ఖర్చులు, సమయం ఆదా కావడంతోపాటు అత్యవసర సమయాల్లో త్వరగా వైద్య పరీక్షలు నిర్వహించేందుకు వీలవుతుంది. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలకు ఈ సేవలు ఎంతో ఉపయోగకరంగా మారనున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, సంబంధిత పనులు పూర్తయి సీటీ స్కాన్ యంత్రం అందుబాటులోకి వస్తే జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి.

పాక్స్ కాన్ కంపెనీలో యువతకు ఉద్యోగ అవకాశాలు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:పాక్స్ కాన్ కంపెనీ వారి ఆధ్వర్యంలో హైదరాబాద్ సమీపంలోని కొంగరకలాన్ లో పెద్ద ఎత్తున ఇయర్ బడ్స్ తయారీ రంగంలో ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయని ఉద్యోగాలలో సూర్యాపేట యువత ఉపాధి పొందాలని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. ఆదివారం స్థానిక పబ్లిక్ క్లబ్ లో పాక్స్ కాన్ కంపెనీ వారి జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్పర్సన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంపెనీ హెచ్ ఆర్ హెడ్ నిక్ మాట్లాడుతూ తాము రాబోయే మూడు సంవత్సరాలలో 33000 మందికి ఉద్యోగాలు కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. తమ వద్ద ఉద్యోగంలో చేరిన వారికి హాస్టల్ వసతి, భోజనం సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు చెప్పారు. పదవ తరగతి నుండి డిగ్రీ వరకు చదివిన వారిలో టాలెంట్ వున్న వారికి తాము శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇస్తామని తెలిపారు. త్వరలోనే సూర్యాపేటలో మరొకసారి జాబ్ మేళా నిర్వహిస్తామని చెప్పారు. ఈకార్యక్రమంలో పాక్స్ కాన్ హెచ్ఆర్ మేనేజర్ వీరా, మహేష్, ఎల్ ఎన్ కంపెనీ చైర్మన్ విక్రం, ఎండి బండి సురేందర్ నాయుడు, కౌశిక్, పెద్దిరెడ్డి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్షా లు పడాలంటూ హైదర్ నగర్ ఈద్గాలో ముస్లిం మత పెద్దల ప్రత్యేక ప్రార్థనలు



కూకట్ పల్లి,ప్రజాస్ఫూర్తి:హైదర్ నగర్ డివిజన్ పరిధి హైదర్ నగర్ గ్రామంలోని ఈద్గా దగ్గర తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు సరిగ్గా పడక రైతులు అల్లాడుతున్నారని భవిష్యత్తులో కరువు కాటకాల నుంచి అల్లా కాపాడాలంటూ ముస్లిం సోదరులు ప్రత్యేక నమాజ్ ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైదర్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు హాజరై ప్రార్థన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మౌలానాలు దువా పట్టించి తెలుగు రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో జీవించాలని భవిష్యత్తులో కరువు కాటకాలు రావద్దని అల్లాకు ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో హైదర్ నగర్ డివిజన్ ముస్లిం సోదరులు హబీబ్,మహమ్మద్ షరీఫ్, మహమ్మద్ ఫసియుద్దీన్, యాసీన్ స్థానిక ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో వైభవంగా దసరా శరన్నవరాత్రులు ప్రారంభం



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం:చుంచుపల్లి మండలంలోని వివిధ గ్రామాలలో దసరా పండుగ సందర్భంగా దేవి శరన్నవరాత్రులు వేడుకలు మొదటి రోజు వైభవంగా నిర్వహించారు . దీనిలో భాగంగా విద్యానగర్ కాలనీ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ వాసిరెడ్డి మురళి ఇంటి దగ్గర ఏర్పాటుచేసిన దుర్గాదేవి మండప పూజలో భాగంగా విగ్రహ దాత , రిటైర్డ్ ఉపాధ్యాయులు డి. వెంకటేశ్వరరావు (డివి) , సుజాత దంపతులు సమక్షంలో మొదటిరోజు శ్రీ బాల త్రిపుర సుందరి దేవి రూపం తో నేత్రపర్వంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు .. మండపాలు దేవీ నామస్మరణతో మారు మ్రోగాయి . అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు . ఈ కార్యక్రమంలో మండప కమిటీ సభ్యులు , స్థానిక మహిళలు పాల్గొన్నారు .

తల్లిదండ్రుల పెళ్లి రోజును మొక్కలతో స్వాగతించిన తనయులు

కేకులకు బదులు బహుమతులుగా మొక్కలు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా నగర్ కు చెందిన ప్రకృతి ప్రేమికుడు, హరిత మిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్న, స్రవంతి దంపతులు పదిహేను సంవత్సరాలు పూర్తి చేసుకొని పదహారవ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా వారి పిల్లలు పెళ్లి రోజు వేడుకను ఘనంగా నిర్వహించారు.పెళ్లి రోజు సందర్భంగా పర్యావరణ జాతీయ అవార్డు గ్రహీత, కుమారుడు దైద హర్షిత్,కూతుర్లు హర్షిత,హర్షికలు తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు.కేకులు కట్ చేయకుండా బెల్లంతో చేసిన స్వీట్స్ తినిపించి, మొక్కలను బహుకరించారు.ఈ సందర్భంగా పిల్లలు మాట్లాడుతూ, "మా అమ్మ నాన్నలు ఇప్పటి వరకు వారి పెళ్లి రోజును జరుపుకోలేదు.మా అమ్మ ద్వారా తెలుసుకొని,మా పాకెట్ మనీ డబ్బులతో ఈ వేడుక చేశాము.మా కోసం వారి పెళ్లి రోజును కూడా మర్చిపోయి, ఎన్నో కష్టనష్టాలు ఉన్నా మమ్మల్ని అపురూపంగా చూసుకుంటున్న తల్లిదండ్రులకు వేడుక చేయడం ఎంతో సంతోషంగా ఉంది" అని అన్నారు."మీరు కూడా మీ అమ్మ, నాన్నల పెళ్లి రోజు, పుట్టిన రోజును తెలుసుకొని సంతోషాన్ని పంచుకోండి. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలతో శుభాకాంక్షలు తెలపండి" అని తెలిపారు.

తెలంగాణలోని అన్ని రహదారులను అభివృద్ధి చేస్తాం

*** రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.**



ప్రజాస్ఫూర్తి, నల్గొండ : తెలంగాణలోని అన్నిరహదారులను అభివృద్ధిచేస్తామని, నల్లగొండ జిల్లాలో ప్రతి గ్రామానికి డబుల్ రోడ్డు సౌకర్యం కల్పిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. జూన్ ,2028నాటికి శ్రీశైలం సొరంగ మార్గం పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని అన్నారు.ఆదివారం ఆయన నల్గొండ జిల్లాలో 74 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ముందుగా మంత్రి కనగల్ మండలం తేలకంటిగూడెం వద్ద 41 కోట్ల రూపాయలతో తెలకంటిగూడెం నుండి తొరగల్లు, జంగమాయి గూడెం మీదుగా ముషంపల్లి గ్రామం వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణ మరియు పటిష్టపరిచే పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే 33 కోట్ల రూపాయలతో నల్గొండనిడమానూరు రోడ్డు నుండి చెట్ల చెన్నారం, చిన్నమాదారం ,తంగెళ్ల వారి గూడెం మీదుగా ముషంపల్లి గ్రామం వరకు చేపట్టే రోడ్డు విస్తరణ , పటిష్టపరిచే పనులకు శేరి లింగోటం వద్ద శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నల్లగొండజిల్లాలో 1600 కోట్ల రూపాయలతో రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. రూ.900 కోట్లతో నల్గొండ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టామని , రహదారుల అభివృద్ధితో పరిశ్రమలు, రైస్ మిల్లులు, ఏర్పాటవుతాయని, రవాణా సౌకర్యాలు మెరుగై, తద్వారా యువతకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని మంత్రి తెలిపారు. భూముల విలువ కూడా పెరుగుతాయన్నారు.జిల్లాలోని ప్రతి గూడెం, గ్రామానికి డబుల్ రోడ్డు సౌకర్యం కల్పిస్తామని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్, సన్నబియ్యం , స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. ఈకార్యక్రమంలోజిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ ,ఆర్ అండ్ బి ఎస్ ఈ. మోహన్, ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, ఆర్ అండ్ బి ఈ ఈ శ్రీధర్ రెడ్డి , కనగల్ తహసిల్దార్ పద్మ, ఎంపీడీవో వేద రక్షిత, మాజీ జెడ్పిటిసి గుమ్మల మోహన్ రెడ్డి ,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి , సర్పంచులు , ఇతర ప్రజాప్రతినిధులు,అధికారులు,తదితరులుపాల్గొన్నారు.

బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



ప్రజాస్ఫూర్తి,భైంసా: నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ అభివృద్ధికి కీలకమైన 28వ ప్యాకేజీకి సంబంధించిన పత్రాలను అమ్మవారి పాదాల చెంత సమర్పించారు. 28వ ప్యాకేజీ పూర్తయితే గోదావరి జలాలను లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా వినియోగించి ముధోల్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయవచ్చని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో ఈ ప్యాకేజీ పనుల కోసం రూ.500 కోట్ల నిధులు కేటాయించాలని కోరినట్లు తెలిపారు.రాబోయే రెండేళ్లలో ప్రాజెక్టు పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించారని చెప్పారు. త్వరలోనే ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రాజెక్టుకు త్వరగా అనుమతులు, నిధులు లభించి పనులు పూర్తికావాలని అమ్మవారిని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గోదావరి జలాలు నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి చేరి, పొలాలను సస్యశ్యామలం చేసి రైతుల జీవితాల్లో సంతోషాన్నినింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు,మండల సీనియర్ నాయకులు ,కార్యకర్తలు తదితరులు ఉన్నారు .

ఆర్టీసీ ఐక్య కూటమి నేతలకు మంత్రి పొంగులేటి అభినందనలు



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పది డిపోలలో 8 డిపోలు తో పాటు జిల్లా కేంద్రం పైన కొత్తగూడెం నడిబొడ్డున ఉన్న కొత్తగూడెం డిపోను కూడా కుట్రలను కుతంత్రాలను ఎదిరించి ఐఎన్టియుసి సారథ్యం లోని ఐక్య కూటమి విజయ సాధించడం పట్ల ఈ విజయానికి కష్టపడి పనిచేసిన ఐఎన్ టియుసి సిఐటియు ఐక్య కూటమి నాయకులను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వారి క్యాంప్ ఆఫీసులో సన్మానించి అభినందించారు . ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తుందని గెలిచిన యూనియన్ నాయకులు కార్మికులకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు . ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షురాలు తోటా దేవి ప్రసన్న, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఆళ్ల మురళి, ఐఎన్ టియుసి జిల్లా నాయకులు రజాక్,సిఐటియు సీనియర్ నాయకులు మల్సూర్, సొసైటీ చైర్మన్ మండే వీర హనుమంతరావు ఐఎన్ టియుసి, సిఐటియు నాయకులు పాల్గొన్నారు .

చదువులో రాణించిన వారికి చేయూతనిచ్చేందుకు సిద్ధమైన సంఘం

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:పద్మశాలి సంఘం, కోపా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 17న ప్రతిభావంతులైన విద్యార్థులకు పురస్కారాలు అందించనున్నారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షులు వేముల వెంకన్న,కోపా జిల్లా అధ్యక్షులు బుధవారం శ్రీనివాస్ కరపత్రాన్ని విడుదల చేశారు. జిల్లాలోని 18 మండలాలకు చెందిన పద్మశాలి విద్యార్థులు, 2026లో పదవ తరగతి నుండి పీజీ,మెడిసిన్,ఐఐటీ వరకు ప్రతిభ కనబరిచిన వారికి ఆర్థిక సహాయం, శాలువాతో సన్మానం చేయనున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు తమ వివరాలను 9441670810, 9441055082 నంబర్లకు పంపాలని ప్రధాన కార్యదర్శి వేముల రవీందర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జంజీరాల రవికుమార్,సామల నాగేశ్వరరావు, వేముల సాగర్, వేముల ఉమాకర్, రవీందర్, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

బాల త్రిపురసుందరి రూపంలో గడి మైసమ్మ అమ్మవారి దర్శనం



మేడ్చల్,(ప్రజాస్ఫూర్తి): మేడ్చల్ పట్టణ పరిధిలోని పాత రెవిన్యూ కార్యాలయ ఆవరణంలో కొలువై ఉన్న శ్రీ గడి మైసమ్మ అమ్మవారి దేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి.నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. నవరాత్రుల తొలిరోజైన ఈరోజు గడి మైసమ్మ అమ్మవారు బాల త్రిపుర సుందరి దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి ప్రత్యేక అలంకరణను దర్శించుకునేందుకు మేడ్చల్ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడి, అమ్మవారి నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. తొమ్మిది రోజుల పాటు జరిగే దేవి నవరాత్రి ఉత్సవాల్లో ప్రతిరోజూ అమ్మవారిని వివిధ దేవి స్వరూపాల్లో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించనున్నారు. ప్రతి రోజు ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, హారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.నవరాత్రుల్లో అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తే కుటుంబంలో సుఖశాంతులు, సౌభాగ్యం, ఆరోగ్యం, ఐశ్వర్యం కలుగుతాయని భక్తుల విశ్వాసం. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

రజత కవచాలంకరణలో శ్రీ కనకదుర్గ అమ్మవారు

భవానీ మాలధారణతో భక్తుల ఆధ్యాత్మిక సందడి



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం: చుంచుపల్లి మండలం లోని గౌతంపూర్ పంచాయతీ పరిధిలోని శ్రీ కనకదుర్గ చంద్రమౌళీశ్వర దేవాలయంలో దేవీ నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అమ్మవారిని రజత కవచం, వివిధ ఆభరణాలు, రంగురంగుల పుష్పమాలలతో సుందరంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకంగా కుంకుమార్చనలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు అనిల్ శర్మ తెలిపారు. భక్తులు భవానీ మాలలు ధరించి తొమ్మిది రోజుల పాటు నియమనిష్ఠలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దేవీ నవరాత్రుల సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు .

సాహితీ సేవకు జాతీయ గుర్తింపు

మహబూబాబాద్ కవికి విజయదశమి పురస్కారం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:హైదరాబాద్ చిక్కడపల్లిలోని త్యాగరాయ గాన సభలో శ్రీ గౌతమేశ్వర సాహితీకళా సేవా సంస్థ ఆరవ వార్షిక వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 39 మందికి సేవా పురస్కారాలు అందజేశారు.ఇందులో భాగంగా మహబూబాబాద్ కు చెందిన సమ్మెట వెంకటేశ్వర్లు కు సాహితీ రంగంలో విజయదశమి పురస్కారం లభించింది. ఆయనకు బంగారు కంకణం,బంగారు పతకం, ప్రశంసా పత్రం, జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సత్కరించారు.అక్షర సమీక్ష దినపత్రిక సంపాదకురాలు అంక విజయదుర్గా భవానీ,సంస్థ అధ్యక్షులు దూడపాక శ్రీధర్, వినాయక సేవా సంస్థ అధ్యక్షులు దీటి గోపాలకృష్ణయ్య చేతుల మీదుగా ఈ సత్కారం అందుకున్నారు.

పెన్షనర్ల సహనానికి పరీక్ష

*** 13న కీలక నిర్ణయం దిశగా అడుగులు**

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:ఈ నెల 13న జరగనున్న చలో



సెక్రటేరియట్ ముట్టడిని జయప్రదం చేయాలని రేవా జిల్లా అధ్యక్షులు సంకా బద్రీనారాయణ పిలుపునిచ్చారు. విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.2024 మార్చి తర్వాత విరమణ పొందిన 26,673 మంది బకాయిలను ఏకమొత్తంలో ఇవ్వాలని, వైద్య ఖర్చులు అందక 127 మంది మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు.16 వేల కోట్ల బకాయిలను, డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో టి. మురళీధర స్వామి, జి. వెంకటేశ్వర్లు, ఐ.వి.రమణయ్య, రత్నమాచారి,బైరి ఉపేందర్,చంద్రయ్య, లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు.

దీపావళి లోపు నిరుపేద కుటుంబాలవారికి రుణాలుఅందించాలి

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఎంబడి చంద్రశేఖర్ డిమాండ్



ప్రజాస్ఫూర్తి,బైంసా:తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే ప్రతి ఒక్కటి ప్రకటనలకే పరిమితం అయిందని గత సంవత్సరం జూన్ రెండవ తారీకు రాజీవ్ యువ వికాసం ద్వారా నిరుపేద యువతకు రుణాలందిస్తామన్న మాట నీటి మూటల మిగిలిపోయిందని మళ్లీ నవంబర్ 19వ తారీఖున ప్రభుత్వం ఇస్తామంటుందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఎంబడి చంద్రశేఖర్ అన్నారు ఆదివారం ఆయన మాట్లాడుతూ ఒకవైపు చూస్తున్నట్లయితే నవంబర్ 19వ తారీకు రాజీవ్ వికాసం ఇస్తామని ఇటీవల ప్రభుత్వ ప్రకటించడం తెలిసిందని రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తులు పెట్టుకున్న వారందరికీ కూడా రుణాలు అందించాలని ఇంకొక వైపు బిసి మహిళలకు ఇస్తామన్నటువంటి కుట్టుమిషన్లకు సంబంధించి ఇప్పటికే దరఖాస్తులు పూర్తయిన వేళ వారికి మరి ఎప్పుడు కుట్టుమిషన్లు ఇస్తారు అన్నదాని పైన కూడా తెలంగాణ ప్రభుత్వం ఒక స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు ప్రభుత్వం ప్రకటనలకే పరిమితం కాకుండా నిరుపేద ప్రజలకు పథకాలను త్రుతగతిన అందించాలని ఆయన అన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ప్రజా ట్రస్ట్ చైర్మన్ బోస్లే మోహన్ రావుపటేల్



ప్రజాస్ఫూర్తి,ఖైంసా:నిర్మల్ జిల్లా బాసర గ్రామానికి చెందిన కుంధుని దేశపాండే ,వినయ్ దేశపాండే గారి తల్లి పరమపదించిన విషయం తెలుసుకున్న మోహన్ రావు పటేల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పటేల్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని కోరారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.

దండేపల్లి మండల నూతన ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక



ప్రజాస్ఫూర్తి , మంచిర్యాల:మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని ఆదివారం నూతన ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడుగా గోపతి శ్రీనివాస్,అధ్యక్షుడు బండి రవిగౌడ్,కార్యనిర్వాహక అధ్యక్షుడుగా అల్లం కుమారస్వామి యాదవ్, ఉపాధ్యక్షులుగా బచ్చల సుభాష్, కట్ట వెంకటేశ్, మెంగని శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి ఎనగందుల సత్యం,కార్యదర్శులు మందల మల్లేష్,ఎడ్ల రాజన్న,కోశాధికారి మోదంపురం వెంకటేశ్,అధికార ప్రతినిధి ఎండి షరీఫ్,సంయుక్త కార్యదర్శి సద్దాం,ప్రచార కార్యదర్శి చుంచు చందు,ముఖ్య సలహాదారులు జి.వెంకటపతి, బూసిరాజు, రాజన్న,గడ్డం సత్యన్న,కార్యవర్గ సభ్యులు: శేర్ల చక్రపాణి, జాడి సత్యం,ఎస్ పి.హరీష్,లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన ప్రెస్ క్లబ్ కార్యవర్గం మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ అభివృద్ధికి జర్నలిస్టుల సమస్యల కోసం తమ శక్తివంతం లేకుండా పోరాడుతామని తెలిపారు.


సోమవారం జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమం రద్దు..

భువనగిరి, ప్రజాస్ఫూర్తి:జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ సోమవారం (అక్టోబర్ 12)న రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రబీ పంటల ప్రణాళిక, పంటల సాగు విధానాలు, పంటల వైవిధ్యీకరణ, వ్యవసాయ నిర్వహణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రైతులను ఉద్దేశించి ప్రసంగించనున్న నేపథ్యంలో, అక్టోబర్ 12వ తేదీ (సోమవారం)న నిర్వహించనున్న రైతు నేస్తం కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించే జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు స్పష్టం చేశారు.ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ వినతులు, ఫిర్యాదులతో సోమవారం కలెక్టరేట్‌కు రావద్దని కలెక్టర్ కోరారు.

షాద్‌నగర్‌లో డికోడ్ మెన్స్ క్యాజువల్ క్లబ్ రెండో బ్రాంచ్ ప్రారంభం

*** ప్రత్యేక పూజలు చేసి నిర్వాహకులను ఆశీర్వదించిన నేతలు**

ప్రజాస్ఫూర్తి,షాద్నగర్:షాద్‌నగర్ పట్టణంలోని పరిగి రోడ్డులో డికోడ్ మెన్స్ క్యాజువల్ క్లబ్ రెండో బ్రాంచ్‌ను ఘనంగా ప్రారంభించారు. నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్ వేర్వేరుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించి, నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా క్లబ్



నిర్వాహకుడు చందు మాట్లాడుతూ.. షాద్‌నగర్ పట్టణ ప్రజలకు గత నాలుగేళ్లుగా తమ మొదటి బ్రాంచ్ ద్వారా సేవలందిస్తున్నామని తెలిపారు. వినియోగదారులకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో పరిగి రోడ్డులో రెండో బ్రాంచ్‌ను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా వివిధ రకాల మెన్స్ క్యాజువల్ దుస్తులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. తమ షాప్ ప్రారంభోత్సవానికి విచ్చేసి ఆశీర్వదించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్‌తో పాటు స్థానిక నాయకులకు నిర్వాహకులు చందు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లికట్ట మాజీ సర్పంచ్ సాయి, స్థానిక నేతలు, నిర్వాహకుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన, భక్తి భావంతోనే మానసిక ప్రశాంతత

*** ఎమ్మెల్సీ నాగరి కుంట నవీన్ కుమార్ రెడ్డి**

ప్రజాస్ఫూర్తి ,షాద్నగర్:ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్సీ నాగరి కుంట నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని ఇప్పల కట్ట వద్ద శ్రీశ్రీశ్రీ హరిబాలనంద దాసు ఆధ్వర్యంలో బంగారు మైసమ్మ,జంట నాగుల, పోతరాజు బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నాగరి కుంట నవీన్ కుమార్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్



రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు.ఈ ఆలయానికి విగ్రహాలు బహుకరించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి కమిటీ సభ్యులు, గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో యువ నాయకుడు శివ చారి,సాగర్,అనిల్,కమిటీ సభ్యులు మాసుల అంజయ్య ముదిరాజ్, మాసుల లక్ష్మయ్య ముదిరాజ్,ఇప్పల రమేష్,ఇప్పల గిరి ముదిరాజ్,నరసింహ ముదిరాజ్,ఇప్పల కుమార్ ముదిరాజ్, ఇప్పల ఆంజనేయులు, ఇప్పల సురేష్ ముదిరాజ్, ఇప్పల వెంకటేష్ ముదిరాజ్, లింగం ముదిరాజ్, వెంకట్,సురేష్,రాజు,తదితరులు పాల్గొన్నారు.

జయ స్కూల్ లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:సూర్యాపేట పట్టణంలో నెహ్రూ నగర్ లో గల జయ స్కూల్ నందు బతుకమ్మ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మల చుట్టూ డ్యాన్సులు వేశారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు జెల్లా పద్మ, బింగి జ్యోతిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి పత్రిక అని అన్నారు. పాఠశాల విద్యార్థులు విద్యతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా చురుగ్గా పాల్గొనాలని అన్నారు. సెల్ ఫోన్ లకు దూరంగా ఉండాలని, ఉపాధ్యాయులు బోధించే అంశాల



పట్ల శ్రద్ధగా విని, పరిక్షలలో మెరుగైన ఫలితాలు సాధించాలని అన్నారు. కార్యక్రమం లో మహిళా టీచర్లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లల్లో అర్హులైన పేదలకు న్యాయం చేయాలి

*** మంత్రి పొంగులేటికి సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ వినతి**

పాలేరు, ప్రజాస్ఫూర్తి: తిరుమలాయపాలెం మండలంలోని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో నిజమైన నిరుపేదలకు అన్యాయం జరుగుతోందని, అనర్హులకు ఇళ్లు కేటాయించారని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ తిరుమలాయపాలెం మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్ అన్నారు. అర్హులైన పేదలకు న్యాయం చేయాలని కోరుతూ మండలంలో సుబ్లేడు గ్రామానికి వచ్చిన మంత్రికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా గొర్రెపాటి రమేష్ మాట్లాడుతూ, గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదలు ఎన్నో ఏళ్లుగా సొంత ఇంటి కోసం ఎదురుచూస్తున్నారని, అలాంటి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయకుండా అన్యాయం



చేయడం సరైంది కాదన్నారు.రాజకీయ పక్షపాతం, నాయకుల సిఫార్సులు, పార్టీ విధేయతలకు అతీతంగా పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరారు.ఈ వినతిపై స్పందించిన మంత్రి నిజమైన లబ్ధిదారులను గుర్తించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని రమేష్ తెలిపారు. ఇచ్చిన హామీని అమలు చేసి అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం ఏ ఐ కె ఎమ్ ఎస్ తిరుమలాయపాలెం మండల అధ్యక్షులు గొర్రెపాటి వీరస్వామి, ప్రగతిశీల యువజన సంఘం నాయకులు నందిపాటి రామకృష్ణ, దారమళ్ల కృష్ణ, ప్రగతి యూత్ సొసైటీ అధ్యక్షులు గొర్రెపాటి లింగన్న, పార్టీ నాయకులు నందిపాటి వెంకన్న, మాగి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

భువనగిరిలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

భువనగిరి, ప్రజాస్ఫూర్తి:భువనగిరి పట్టణ కేంద్రంలోని 23వ వార్డులో కౌన్సిలర్ బర్రె పూజిత జహంగీర్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను మహిళలతో కలిసిఅరుంధతి యూత్ అసోసియేషన్,పూత లింగన్న బొడ్రాయి, కామునికంతా, మమ్మయమ్మ గుడి, బెల్లంకొండ ఉపేందర్ ఇంటి వద్ద జరిగిన ఘనంగా నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ పూజిత జహంగీర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు మహిళల సందడి, సాంస్కృతిక కళావైభవం మధ్య ఉత్సాహభరితంగా సాగాయి.ఈ సందర్భంగా మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి



వేడుకల్లో పాల్గొన్నారు. కౌన్సిలర్ బర్రె పూజిత జహంగీర్ స్వయంగా కాలనీ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ, సంప్రదాయ పాటలు పాడుతూ వారిలో ఉత్సాహాన్ని నింపారు. బతుకమ్మల చుట్టూ మహిళలు సంప్రదాయబద్ధంగా ఆడిపాడడంతో వార్డులో పండుగ వాతావరణం నెలకొంది.

పెద్దల సభలో పేదల గొంతుక కోసం డిమాండ్

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా డా. పెరుమాండ్ల రామకృష్ణకు అవకాశం ఇవ్వాలని గిరిజన సంఘం యువ నాయకులు గూగులోత్ దేవ్ సింగ్ కోరారు.ఎన్ఎస్యూఐ నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన డా. రామకృష్ణ,ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ లోనే కొనసాగుతూ దళితబహుజన సంక్షేమం కోసం పనిచేస్తున్నారని తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో కేసులు ఎదురైనా పార్టీ మారలేదని, ఇది ఆయన నిబద్ధతకు నిదర్శనమన్నారు. సుమారు 30 మంది మంత్రులు, ఎమ్మెల్యేలు ఆయనకు మద్దతుగా సిఫారసు లేఖలు ఇచ్చారని పేర్కొన్నారు. రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదలకు వైద్య సేవలు అందిస్తూ పేదోళ్ల డాక్టర్ గా గుర్తింపు పొందారని, ప్రజా సేవ కోసం గాంధీ ఆసుపత్రి ఉద్యోగానికి రాజీనామా చేశారని తెలిపారు.ఆయనకు అవకాశం ఇస్తే మాదిగ,దళితబహుజన వర్గాలకు ప్రాతినిధ్యం లభిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో భూక్యా బాసింగ్, జాటోత్ వీరన్న, భూక్యా బాలాజీ, భూక్యా హరి సింగ్, భూక్యా బావ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌లో శారదా స్వీట్ షాప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



ప్రజాస్ఫూర్తి ,షాద్నగర్: పట్టణంలోని మెయిన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన శారదా స్వీట్ షాప్‌ను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్వీట్ షాప్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.స్థానికంగా నూతన వ్యాపార సంస్థలు ఏర్పాటవడం ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు అందుబాటులోకి రావడంతో పాటు, వ్యాపార అభివృద్ధికి మరియు ఉపాధి అవకాశాలకు దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, గిరిజన. ఆదివాసి రాష్ట్ర కో ఆర్డినేటర్ రఘు నాయక్,మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్,సంగెం గ్రామ సర్పంచ్ వేణు గోపాల్ , ఉప్పరి గడ్డ గ్రామ సర్పంచ్ చందు నాయక్ వెంకమ్మగూడ గ్రామ సర్పంచ్ అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్ శ్రీను నాయక్,, ఉప సర్పంచ్ షకీల్ నాయకులు, వ్యాపార ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో కార్యకర్త కుటుంబానికి అండగా పిల్లుట్ల రఘు



గరిడేపల్లి ,ప్రజాస్ఫూర్తి:గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామంలో ఇటీవల.అనారోగ్యంతో ఎల్లుట్ల లక్ష్మమ్మ మృతి చెందారు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త ఎల్లుట్ల రమేష్ వెంకటేశ్వర్లు తల్లి ఎల్లుట్ల లక్ష్మి గారి కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ నాయకులు పిల్లుట్ల రఘు పరామర్శించారు.ఈ సందర్భంగా హుజూర్‌నగర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు పిల్లుట్ల రఘు ఆధ్వర్యంలో ఎల్లుట్ల లక్ష్మి గారి కుటుంబానికి రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ వార్డ్ నెంబర్లు లావణ్య ఆదెమ్మ భాస్కర్ పోటు సైదులు పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు రాధాకృష్ణ వెంకటేశ్వర్లు శీను సంజీవ్ సుధాకర్ చిరంజీవి దీలీప్ వెంకటయ్య చంద్రయ్య విజయ్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐజేయు జాతీయ సమితి సభ్యులుగా ఎన్నికైన వంశీకృష్ణకు సన్మానం



ప్రజాస్ఫూర్తి , జన్నారం: టీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారిగా బాధ్యతలు నిర్వహించిన కేశెట్టి వంశీకృష్ణ ఇటీవల ఐజేయు జాతీయ సమితి సభ్యులుగా ఎన్నికయ్యారు.ఆదివారం రోజున మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగిన టీయూడబ్ల్యూజే జిల్లా సమావేశంలో వంశీకృష్ణను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ జర్నలిస్టుల అభివృద్ధి కొరకు తన తన సాయి శక్తుల కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ ప్రకాష్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు డేగ సత్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ చౌదరి, చిలువేరు నర్సయ్య, రవి రాజా, జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు.

దివంగత రంగాపురం ప్రభువు సాగర్ కు సగర సంగం ఆధ్వర్యంలో సంతాప సభ...

*** నివాళులర్పించిన సంఘం నేతలు**



కూకట్ పల్లి,ప్రజాస్ఫూర్తి: సగర సంగం మాజీ అధ్యక్షులు దివంగత రంగాపురం ప్రభువు సాగర్ సంతాప సభ జగదిరిగుట్ట సగర సంగం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర సంగం నాయకులు మహిళలు యువజన సంఘం నాయకులు ప్రభు సాగర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగద్గిరిగుట్ట సగర సంగం ఏర్పాటు సమయంలో సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా దివంగత ప్రభుత్వ సాగర్ భార్య రుక్మిణమ్మకు సంఘం తరఫున 50వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం సంఘం సభ్యులకు మన అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. జగద్గిరిగుట్ట సగర సంగమ అధ్యక్షులు వేముల సుదర్శన్ సాగర్ ప్రధాన కార్యదర్శి ఎం ఎస్ భీమయ్య సాగర్ కోశాధికారి వెంకటరమణ సాగర్ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు,సగర మహిళా సంఘం, సగర యువజన సంఘం, సగర బంధువులు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి సమస్యలకు తొలి అడుగు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:ఎంప్లాయిస్,టీచర్స్, పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మహబూబాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మొదటి సమావేశం నిర్వహించారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలలో జరిగిన ఈ సమావేశంలో వివిధ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలపై చర్చించారు.వారి సమస్యలను ఉమ్మడిగా పరిష్కరించుకోవాలని నిర్ణయించారు.ఈ సందర్భంగా తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షుడిగా డా.పుచ్చ రామ్మూర్తి, అధ్యక్షులుగా బొక్క మల్లారెడ్డి,ప్రధాన కార్యదర్శిగా నాయిని అనిల్,ఉపాధ్యక్షులుగా మల్లం వెంకటస్వామి,బొప్పి శ్రీనివాసరెడ్డి,కక్కిం లక్ష్మారెడ్డి, కార్యదర్శులుగా గండ్రకోట అనిల్, లక్ష్మీరావ్,భీముడు, మహిళా అధ్యక్షురాలిగా డోలి చంద్రకళ,ట్రెజరర్ గా యంచి లక్ష్మీ రామకృష్ణ, సలహాదారులుగా వంగా రామన్న, పింగిళి శ్రీనివాస్, సభ్యులుగా గోపు శ్రీను,పెల్లి తిరుపతిరావు, పుచ్చనబోయిన సత్యం తదితరులు ఎన్నికయ్యారు.ఈ ఎంపిక తెలంగాణ ఎంప్లాయిస్,టీచర్స్, పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు విజయ్, దేవయ్య,శ్రీనివాసులు, పుల్లయ్య, అమ్మగారి ఆధ్వర్యంలో జరిగింది.

సైనికుల సేవలు వెలకట్టలేము



జగద్గిరిగుట్ట,ప్రజాస్ఫూర్తి: సైనికుల సేవలు మనం వెలకట్టలేమని మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి ,బీజేపీ ఓబిసి మోర్చా అధ్యక్షులు జె.కె.శేఖర్యాదవ్ లు అన్నారు. సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా ఆదివారం ఉదయం హుడా పార్క్ లో కెప్టెన్ భీమయ్య కి ,బిజెపి ఎక్స్ సర్వీస్ మెన్ రాష్ట్ర సెల్ కన్వీనర్ శ్రీనివాసరావు కి , వారి బృందానికి జెకె శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో శాలువాలతో వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బార్డర్లో వారి ప్రాణాలను ఫణంగా పెట్టి మన దేశ రక్షణ మన ప్రారక్షణ కోసం వారు ఎన్నో కష్ట నష్టాలకు ఓర్చి కుటుంబాన్ని పిల్లలను వదిలిపెట్టి ఈ యొక్క దేశ భద్రత ముఖ్యమని విధులు నిర్వహిస్తారన్నారు. ఆ విధుల్లో అమరులైన వారు ఎంతో మంది ఉన్నారన్నారు. వారి రుణం మనం తీర్చుకోలేనిదన్నారు. ఈ దేశానికి వెన్నెముకలనటువంటి ఇద్దరు జై జవాన్ జై కిసాన్ అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ఎక్స్ సర్వీస్ మెన్ సెల్ కన్వీనర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారి మిత్ర బృందంతో భీమయ్య కి సత్కరించి వారి సేవలు కొనియాడారు.

వైభవంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

*** రఘునాథపల్లి శ్రీ మహాదేవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు**

రఘునాథపల్లి,ప్రజాస్ఫూర్తి: రఘునాథపల్లి మండల కేంద్రంలోని శ్రీ మహాదేవ స్వామి దేవాలయంలో ఆదివారం దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో భక్తులను ఆకట్టుకుంది.ఈ సందర్భంగా శ్రీ మహాదేవ స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ కూరెళ్ళ పెద్ద ఉపేందర్, రేణుక దంపతులు మాట్లాడుతూ దుర్గమ్మ దీవెనలు ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని, ప్రజల జీవితాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. అమ్మవారి కరుణాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, సంపూర్ణ ఆరోగ్యంతో వర్ధిల్లాలని కోరుకున్నారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు పిండి పోలు శ్రీనివాస్ శర్మ మాట్లాడుతూ నవరాత్రుల తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో ఆలయానికి విచ్చేసి



అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. అమ్మవారి అనుగ్రహంతో ప్రతి ఒక్కరి జీవితాల్లో శాంతి, సౌభాగ్యం, సంతోషం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తుల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని భక్తులు పేర్కొన్నారు. అమ్మవారి దీవెనలతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, రఘునాథపల్లి ప్రాంతం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

ప్రాణాపాయ స్థితిలో తెలంగాణ ఉద్యమ నాయకురాలు జాడి మంజుల

*** మానవతా దృక్పథంతో ఆదుకోవాలని విజ్ఞప్తి**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ ఉద్యమ కళాకారుడు, అభ్యుదయ చైతన్య గీతాల గాయకుడు, సామాజిక కార్యకర్త, జర్నలిస్టుగా సుపరిచితులైన కొండ జంపన్న భార్య జాడి మంజుల ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని మహావీర్ ఆసుపత్రిలో అత్యవసర విభాగంలో ఆమెకు చికిత్స అందిస్తున్నారు.పేద కుటుంబంలో జన్మించి, మారుమూల అటవీ ప్రాంతం నుంచి వచ్చి విద్యార్థులు, మహిళలకు స్ఫూర్తిగా నిలిచిన జాడి మంజుల.. పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం, పీఓడబ్ల్యూ మహిళా సంఘం ద్వారా ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలోకేసులకు భయపడకుండా,



బెదిరింపులకు లొంగకుండా జిల్లా, రాష్ట్ర స్థాయుల్లో ఉద్యమమే ఊపిరిగా ముందుకు సాగారు. తెలంగాణ సాధన కోసం తన వంతు కృషి చేసిన మహిళా ఉద్యమ నాయకురాలిగా గుర్తింపు పొందారు.ఆమె భర్త కొండ జంపన్న ప్రస్తుతం భద్రాద్రి స్వేరోస్ జిల్లా జనరల్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఆపన్నహస్తం అందించండి

ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జాడి మంజుల త్వరగా కోలుకుని ఆరోగ్యంగా తిరిగి రావాలని ఆకాంక్షిస్తూ,ఆమెకుటుంబానికిఅండగా నిలవాలని సహృదయులందరికీ విజ్ఞప్తి చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబానికి తమకు తోచినంత సహాయం అందించి మానవత్వాన్ని చాటాలని కోరుతున్నారు.సహాయం అందించాల్సిన వివరాలు గూగుల్ పే / ఫోన్‌పే: 9640542268,బ్యాంకు ఖాతా వివరాలు: ఖాతాదారుడి పేరు: KONDA JAMPANNA ఖాతా నంబర్: 9051101100018O1, ఐఎఫ్ఎస్‌సీ కోడ్: BKID0009051, జాడి మంజుల త్వరగా కోలుకోవడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కుటుంబ సభ్యులు, ఉద్యమ సహచరులు విజ్ఞప్తి చేస్తున్నారు.

టైగర్ జోన్ లో కోర్, బఫర్ జోన్ల మ్యాపులను విడుదల చేయాలి

ప్రజాస్ఫూర్తి , జన్నారం: జన్నారం మండలంలో సిపిఎం ఉమ్మడి జిల్లా ముఖ్య నాయకుల సమావేశం బోడెంకి చందు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు . ఈ సమావేశానికి పూసం సచిన్ సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు హాజరై మాట్లాడుతూ, టైగర్ జోన్ పేరిట, ఆదివాసిలను, రైతులను, కూలీలు అనేక ఆంక్షలు పేరుతో ఇబ్బందులు పెడుతున్నారని,ఇందిరమ్మ ఇల్లు, నూతన రోడ్లు, గ్రామపంచాయతీ నిధులు, ఆపేస్తున్నారని, కులవృత్తులను, ఆదివాసీలను, రైతులను అటవీ ఉత్పత్తుల కోసం వెళ్లకుండా ఆంక్షలు విధిస్తూ, కేసులు, దాడులు, చేసి అడవులకు దూరం చేసే ప్రయత్నం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఆదివాసీలు, రైతులు, కులవృత్తులు, ఇతర సామాజిక సంఘాలు కలుపుకొని పోరాటాలకు సిద్ధం కావాలని టైగర్



జోన్ లోని కోర్, బఫర్ మ్యాప్ లు విడుదల చేయాలని,అనుభవదారులైన ఆదివాసులపై ఫారెస్ట్ ఆంక్షలు ఆపాలని, కోరారు. అటవీ ఉత్పత్తులపై ఆంక్షలు ఎత్తివేయాలని, గొర్ల,పశువుల కాపర్లు, మేదరి, ఆదివాసి, అనేక కుల వృత్తుల కాపాడాలని, లేదంటే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాల్సిన వస్తుందని, ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోకనికారపు అశోక్,దుర్గం నూతన కుమార్, బొజ్జ ఆశన్న, ఉమ్మడి జిల్లాల సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు, .లింగన్న, దుంపల రంజిత్ కుమార్, సిదం శంబు,జయక్క,సోనీ,రాజేశ్వరి, బుచ్చన్న, తిరుపతి, రాజలింగు, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి సమస్యలకు తొలి అడుగు


మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:ఎంప్లాయిస్,టీచర్స్, పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మహబూబాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మొదటి సమావేశం నిర్వహించారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలలో జరిగిన ఈ సమావేశంలో వివిధ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలపై చర్చించారు. వారి సమస్యలను ఉమ్మడిగా పరిష్కరించుకోవాలనినిర్ణయించారు.ఈ సందర్భంగా తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షుడిగా డా.పుచ్చ రామ్మూర్తి, అధ్యక్షులుగా బొక్క మల్లారెడ్డి,ప్రధాన కార్యదర్శిగా నాయిని అనిల్,ఉపాధ్యక్షులుగా మల్లం వెంకటస్వామి,బొప్పి శ్రీనివాసరెడ్డి,కక్కిం



లక్ష్మారెడ్డి, కార్యదర్శులుగా గండ్రకోట అనిల్, లక్ష్మీరావ్,భీముడు, మహిళా అధ్యక్షురాలిగా డోలి చంద్రకళ,ట్రెజరర్ గా యంచి లక్ష్మీ రామకృష్ణ, సలహాదారులుగా వంగా రామన్న, పింగిళి శ్రీనివాస్, సభ్యులుగా గోపు శ్రీను,పెల్లి తిరుపతిరావు, పుచ్చనబోయిన సత్యం తదితరులు ఎన్నికయ్యారు.ఈ ఎంపిక తెలంగాణ ఎంప్లాయిస్,టీచర్స్, పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు విజయ్, దేవయ్య,శ్రీనివాసులు, పుల్లయ్య, అమ్మగారి ఆధ్వర్యంలో జరిగింది.

టీచర్స్ ప్రీమియర్ లీగ్ విజేతగా భద్రాద్రి కొత్తగూడెం జట్టు

*** రన్నరప్‌గా సూర్యాపేట జట్టు..**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం:తెలంగాణ టీచర్స్ ప్రీమియర్ లీగ్ రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ సీజన్-3 ఘనంగా ముగిసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వేదికగా నిర్వహించిన ఈ పోటీల్లో ఎనిమిది జిల్లాలకు చెందిన ఉపాధ్యాయ క్రీడాకారులు పాల్గొన్నారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం జట్టు విజేతగా నిలవగా, సూర్యాపేట జట్టు రన్నరప్‌గా నిలిచింది.టోర్నమెంట్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి చెందిన ఏసీజీఈ ఎస్. మాధవరావు ప్రారంభించారు. ముగింపు కార్యక్రమానికి యామిని మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి, కొత్తగూడెంకు చెందిన ఆర్థోపెడిక్ నిపుణులు డాక్టర్ బి.ఎన్. జీవన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విజేత, రన్నరప్ జట్లకు బహుమతులు అందజేశారు.డాక్టర్ జీవన్ కుమార్ దమ్మపేట ప్రభుత్వ గురుకుల పాఠశాలలో విద్యనభ్యసించారు.ప్రభుత్వ ఉపాధ్యాయుల పట్ల తనకున్న గౌరవం, అభిమానంతో టోర్నమెంట్‌కు స్పాన్సర్‌గా సహకరించారు. ఈ సందర్భంగా ఆయనకు నిర్వాహక బృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని, ఉపాధ్యాయుల మధ్య స్నేహభావం, ఐక్యత, జట్టుగా పనిచేసే స్ఫూర్తిని పెంపొందిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.టోర్నమెంట్ విజయవంతానికి సహకరించిన ఎనిమిది జిల్లాల క్రీడాకారులు, స్పాన్సర్లు, అధికారులు, నిర్వాహకులకు తెలంగాణ టీచర్స్ ప్రీమియర్ లీగ్ ప్రభుత్వ ఉపాధ్యాయుల బృందం ధన్యవాదాలు తెలిపింది.

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేసిన పొంగులేటి




కూసుమంచి,ప్రజా స్ఫూర్తి: మండలానికి చెందిన 30 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం పంపిణీ చేశారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ సునీల్‌దత్‌తో కలిసి లబ్ధిదారులకు మొత్తం రూ.30,03,480 విలువ చేసే చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు అండగా నిలిచేందుకు ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. అన్ని వర్గాలకు లబ్ధి కలిగించేలా ప్రజా పాలన నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, సర్పంచ్ కొండా కృష్ణవేణి, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పెయిన్ కిల్లర్స్ అతిగా వాడితే..

కొత్త నొప్పులే..

మనలో చాలా మంది కాస్త తలనొప్పి అనిపించగానే పెయిన్ కిల్లర్స్ వాడుతుంటారు. బాడీ పెయిన్స్‌కి కూడా ట్యాబ్లెట్స్‌ను వేసుకుంటారు. అయితే పెయిన్ కిలర్స్‌ని వాడడం వల్ల వెంటనే నొప్పి తగ్గిన భావన కలిగినా దీర్ఘకాలంలో మాత్రం తీవ్ర సమస్యలు ఎదురవుతాయని నిపుణులు చెబుతున్నారు. మరీ ముఖ్యంగా వైద్యులను సంప్రదించకుండా పెయిన్ కిల్లర్స్‌ని వాడడం వల్ల ఎన్నో సమస్యలకు దారి తీస్తుందని అంటున్నారు.



పెయిన్ కిల్లర్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలు...

* పెయిన్ కిల్లర్స్ వేసుకోగానే నొప్పి తగ్గిన భావన కలిగినా తర్వాత తలనొప్పి పెరిగే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. పెయిన్ కిల్లర్స్‌ను అతిగా వాడే వారిలో తరచూ తలనొప్పి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.
* కొన్ని రకాల పెయిన్ కిల్లర్స్‌ని ఎక్కువ రోజులు వాడడం వల్ల కడుపు సంబంధిత సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా కడుపులో చికాకు, అల్సర్, అంతర్గత రక్తస్రావం వంటి సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
* ఇక ట్యాబ్లెట్స్‌ను ఎక్కువగా వేసుకోవడం వల్ల ఎదురయ్యే ప్రధాన సమస్యల్లో కిడ్నీలు దెబ్బతినడం ఒకటి. పెయిన్ కిల్లర్స్ అధికంగా వాడే వారిలో మూత్రపిండాల వైఫల్యం ఎక్కువగా కనిపిస్తుందని నిపుణులు చెబుతున్నారు.
* పెయిన్ కిల్లర్స్‌ను అధికంగా వాడడం వల్ల కాలేయంపై ప్రతికూల ప్రభావం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఎసిటమైనోఫెన్ ట్యాబ్లెట్స్‌ను ఎక్కువగా తీసుకోవడం వల్ల కాలేయ వైఫల్యానికి దారి తీస్తుంది. పెయిల్ కిల్లర్స్‌ను వాడే సమయంలో కొన్ని పద్ధతులు పాటించాలని నిపుణులు చెబుతున్నారు. పెయిన్ కిల్లర్స్‌ను తీసుకునే సమయంలో ఒక ట్యాబ్లెట్‌కి మరో ట్యాబ్లెట్‌కి మధ్య కనీసం 5 గంటలు ఉండేలా చూసుకోవాలి. అలాగే వారానికి 23 సార్లు కంటే ఎక్కువ తీసుకోకూడదు. నొప్పి చాలా కాలం పాటు కొనసాగితే లేదా తరచుగా సంభవిస్తే వైద్యుడిని సంప్రదించాలి. మరీ ముఖ్యంగా వైద్యులను సంప్రదించకుండా పెయిన్ కిల్లర్స్‌ని వాడడం వల్ల ఎన్నో సమస్యలకు దారి తీస్తుందని అంటున్నారు. పైన తెలిపిన వివరాలు ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్న సమాచారం మేరకు అందించినవి మాత్రమే. ఆరోగ్యానికి సంబంధించి వైద్యుల సూచనలు పాటించడమే ఉత్తమం.





మధుర పరిమళాల మనోహరం!

ప్రకృతి ఒడిలో వికసించే పూలలో కొన్ని కేవలం అందాన్ని ఇస్తే, మరికొన్ని మధురమైన సుగంధాన్ని వెదజల్లుతాయి. కానీ, ఈ రెండింటినీ రంగరించుకున్న అద్భుతమైన తీగ మొక్క 'హనీసకల్'.





హనీసకల్ అనగానే మనకు గుర్తొచ్చేది దాని విలక్షణమైన పూల ఆకారం. గొట్టం ఆకారంలో ఉండే ఈ పూలు గుత్తులు గుత్తులుగా పూస్తాయి. ఈ పూల అడుగు భాగంలో ఉండే మకరందం అత్యంత తీపిగా ఉండటం వల్ల దీనికి 'హనీసకల్' అనే పేరు వచ్చింది. పూలు... తెలుపు, పసుపు, ఎరుపు, పింక్ నారింజ రంగులలో విచ్చుకుంటాయి. ఈ పూల తీపి వాసన సీతాకోకచిలుకలను, తేనెటీగలను హమ్మింగ్ బర్డ్స్‌ను ఆకర్షిస్తుంది. సువాసనలు వెదజల్లే ఈ పూలలో కొన్ని రకాలు... సాయంత్రం వేళల్లో మరింత గాఢమైన సుగంధాన్ని విడుదల చేస్తాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 180 రకాల జాతుల్ని కలిగిన హనీసకల్ మొక్కది వేల ఏళ్ల చరిత్ర. ప్రాచీన చైనా వైద్య శాస్త్రంలో దీన్ని కీలకంగా వాడతారు. ముఖ్యంగా శరీరాన్ని చల్లబరచడానికీ, విష పదార్థాలను బయటకు పంపడానికీ ఉపయోగిస్తారట. బ్రిటన్‌లో విక్టోరియన్ కాలంలో ఈ పూలను ప్రేమకు, విశ్వాసానికి చిహ్నంగా, పెళ్లిలో వధువు ఈ పూలను పెట్టుకోవడం శుభసూచకంగా నూ భావించేవారట. అందుకేనేమో... షేక్స్‌పియర్ వంటి ప్రముఖ కవుల రచనల్లో ఈ పూల ప్రస్తావన ఎక్కువగా కనిపిస్తుంది.

తేమ అవసరమే కానీ...

ఈ మొక్కకు రోజుకు కనీసం 6 నుంచి 8 గంటల పాటు ఎండ అవసరం. ఎండ తక్కువైతే పూలు తక్కువగా పూస్తాయి. నీరు నిల్వ ఉండని సారవంతమైన నేలలు దీనికి అనుకూలం. ఇవి తీగ జాతి మొక్కలు కాబట్టి, పాకడానికి గోడలు, ఫెన్సింగ్ లేదా ట్రెల్లీస్ వంటి ఆధారాల్ని కల్పించాలి. మొక్క నాటిన కొత్తలో క్రమం తప్పకుండా నీరు పెట్టాలి. ఎదిగిన తర్వాత నేల పైపొర ఆరిపోయినప్పుడు మాత్రమే నీరు పోయాలి. వేర్ల దగ్గర తేమ ఉండాలి కానీ నీరు నిలిచిపోకూడదు. శీతకాలం చివరలో లేదా వసంతకాలం మొదట్లో మొక్కను కత్తిరించాలి. ఎండిపోయిన





కొమ్మలను తొలగించడం వల్ల కొత్త చిగుళ్లు వచ్చి పూలు ఎక్కువగా పూస్తాయి. ఏడాదికి రెండుసార్లు కంపోస్ట్ లేదా స్లోరిలీజింగ్ ఫెర్టిలైజర్లను అందించాలి. ఈ మొక్కకు పిండి నల్లి, తెల్లదోమ, బూజు తెగులు వంటివి వచ్చే అవకాశం ఉంది. వీటిని దూరం చేయడానికి ఫంగిసైడ్‌తో పాటు వేపనూనె పిచికారీ చేయవచ్చు. దానికంటే ముందుగా వ్యాధిసోకిన కొమ్మలు, ఆకులను కత్తిరించి దూరంగా పారేయడం మంచిది. ఈ జాగ్రత్తలతో మొక్క ఆరోగ్యంగా నిండుగా పూస్తుంది.

చెమట పడితే మంచిదేనట!


వేసవిలో వేడికి తట్టుకోలేక శరీరం చెమటలు పట్టడం సహజమే! అయితే ఇలా చెమటలు రావడం వల్ల చిరాగ్గా, అసౌకర్యంగా అనిపిస్తుంటుంది. దీంతో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లను ఆశ్రయిస్తుంటాం. నిజానికి శరీరం నుంచి చెమట బయటికి రాకుండా ఎప్పుడూ ఇలా చల్లటి వాతావరణంలో గడపడం కంటే.. కాస్త చెమట పట్టనివ్వడమే ఆరోగ్యకరం అంటున్నారు నిపుణులు. మరి, అదెలాగో తెలుసుకుందాం రండి..

వడదెబ్బ తగలకుండా..!

ఎండాకాలంలో కాసేపు బయట గడిపినా, అధిక ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల వడదెబ్బ తగులుతుంటుంది. అయితే చెమటలు పట్టడం వల్ల వడదెబ్బ నుంచి కొంతవరకు రక్షణ పొందచ్చంటున్నారు నిపుణులు. అదెలాగంటే.. చెమట మన శరీరానికి సహజసిద్ధమైన కూలింగ్ ఏజెంట్‌లా పనిచేస్తుంది. ఎండ వేడి శరీరంలోకి వెళ్లకుండా చెమట అడ్డుపడుతుంది. తద్వారా శరీరంలో ఉష్ణోగ్రతలు పెరగకుండా జాగ్రత్తపడచ్చు. ఇక ఈ కాలంలో వడదెబ్బ నుంచి రక్షణ పొందాలంటే.. ద్రవాహారం ఎక్కువగా తీసుకోవడం, శరీరానికి చలువ చేసే పదార్థాల్ని తీసుకోవడమూ ముఖ్యమే అంటున్నారు నిపుణులు.

రోగనిరోధక శక్తికి!

స్వేద గ్రంథులు విడుదల చేసే చెమట



రోగనిరోధక శక్తినీ పెంచుతుందని ఓ అధ్యయనంలో తేలింది. ఇందుకు స్వేద గ్రంథుల్లో ఉండే యాంటీమైక్రోబియల్ పెప్టైడ్లే కారణమట! ఇవి వ్యాధులకు కారణమయ్యే క్రిములతో పోరాడి.. సహజ రక్షణ కల్పిస్తాయి అంటున్నారు నిపుణులు.

ఇవి కూడా!

* వ్యాయామం చేసే క్రమంలో చెమట పడుతుంది. తద్వారా శరీరం చల్లబడడంతో పాటు ఎండార్ఫిన్లూ విడుదలవుతాయి. ఫలితంగా శారీరక నొప్పులు, ఒత్తిళ్లు తగ్గి ప్రశాంతంగా ఉండచ్చు అంటున్నారు నిపుణులు.
* శరీరం చెమట పట్టినప్పుడు చర్మ గ్రంథులు తెరుచుకుంటాయి. తద్వారా చర్మ రంధ్రాల్లో గాలి బాగా ఆడుతుంది. అలాగే శరీరంలోని మలినాలూ చెమట రూపంలో బయటికి వచ్చేస్తాయి. వీటివల్ల చర్మం ఎప్పటికప్పుడు శుభ్రపడుతుందట.

గమనిక : అయితే ఇలా చెమట పట్టడం మంచిదే అయినా.. ఎక్కువసేపు ఇలాగే ఉండడం వల్ల చర్మ ఆరోగ్యం దెబ్బతింటుంది. వాతావరణంలోని దుమ్ముధూళి చెమటతో కలిసి చర్మ రంధ్రాల్లోకి చేరడం వల్ల మొటిమలు, మచ్చలు ఏర్పడతాయి. కాబట్టి చెమట పట్టిన వెంటనే స్నానం చేయడం మంచిదంటున్నారు నిపుణులు.

వేసవి తాపాన్ని తగ్గించే జల్ జీరా!

ఎండా కాలం వచ్చిందంటే చాలు దాహంతో అల్లాడిపోతుంటాం. ఈ సమయంలో కృత్రిమమైన కూల్ డ్రింక్స్, సోడాలను తాగే బదులు ఓ గ్లాస్ జల్ జీరా తాగి చూడండి. ఇది దాహం తీర్చడమే కాదు... మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలనూ అందిస్తుంది. ముఖ్యంగా ఇందులోని జీలకర్ర జీర్ణ రసాల ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. గ్యాస్, ఎసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తగ్గిస్తుంది. దీన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే శరీరానికి అవసరమైన ఇనుమూ అందుతుంది. పీరియడ్స్ సమయంలో వచ్చే పొత్తికడుపు నొప్పి, తిమ్మిర్ల నుంచి ఈ పానీయం ఉపశమనం కలిగిస్తుంది. ఇక, ఇందులోని నల్ల ఉప్పు... శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లను అందిస్తుంది. అందుకే, ఎండలో తిరిగి ఇంటికి రాగానే ఒక గ్లాసు జల్ జీరా తాగి చూడండి. ఆ అలసట తక్షణమే మాయమవుతుంది. వేయించిన జీలకర్ర, కొద్దిగా అల్లం ముక్క, పుదీనా ఆకులు, పచ్చిమిర్చి (అవసరమైతే) కలిపి మెత్తగా రుబ్బాలి. ఈ మిశ్రమాన్ని చల్లని నీటిలో కలిపి, తగినంత నల్ల ఉప్పు, ఆమ్‌చూర్ పొడి, నిమ్మరసం కలపాలి. చివరగా కొద్దిగా బూందీ చల్లుకుంటే సరి. రుచికరమైన జల్ జీరా తయారైనట్లే. సహజ సిద్ధమైన ఈ పానీయం పెయిన్‌కిల్లర్‌లానూ పనిచేస్తుంది. జీవక్రియను మెరుగుపరుస్తుంది. ముఖ్యంగా తక్కువ కెలొరీలు ఉండి, ఆకలిని నియంత్రించడంలో సహాయపడటం వల్ల బరువు తగ్గాలనుకునే మహిళలకు మంచి ఎంపిక.





ఇలా... ప్రకృతికి చేరువగా!

అపార్ట్‌మెంట్లలో ప్రతి చదరపు అడుగూ విలువైనదే. ఆయా గదుల్ని వినియోగం పరంగా ప్రత్యేకంగా మార్పులు చేసుకోలేం కానీ, బాల్కనీ అందుకు మినహాయింపు. అందుకే దీన్ని ఎలా తీర్చిదిద్దుతున్నామనేది ముఖ్యం. ప్రకృతికీ, పచ్చదనానికీ చేరువయ్యేందుకు ఇదో దగ్గర మార్గం. అందుకోసం ఏం చేయాలంటే...

కాసేపు ఎండ పట్టడం, తీరిగ్గా కూర్చొని కప్పు కాఫీ తాగడం, ధ్యానం చేసుకోవడం... అన్నింటికీ ఒకటే చోటు... బాల్కనీ. చూశారా ఇది ఎంత ముఖ్యమైందో! అందుకే దీన్ని చిన్నపాటి పార్కుగా మార్చేయాలి. అప్పుడే ప్రకృతిలోకి వెళ్లాలనుకున్నప్పుడల్లా అక్కడ కాసేపు కూర్చొని సేదతీరొచ్చు.

* నిలువుగా పెరిగే మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వండి. అవి పాకేందుకు వీలుగా ఏర్పాట్లుచేయాలి. ఇవి గాలిని శుద్ధి చేస్తాయి. అలాగే ఎండ నుంచి ఉపశమనం కలిగిస్తాయి.
* తరచూ మార్చాల్సిన పనిలేకుండా ఎండలూ, వర్షాలకు తట్టుకునే మెటీరియల్‌ని అక్కడ ఉపయోగించాలి. అందుకు గట్టి కుండీలు, మెటల్‌తో చేసిన వస్తువులు ఎంచుకోవడం మేలు.
* ఇన్విజబుల్ నెట్టింగ్ బార్‌ని ఉపయోగించి పావురాలను దూరం పెట్టండి. అక్కడ కూర్చునేందుకు ప్రత్యేకంగా చిన్న సైజు కుర్చీల్ని వినియోగించండి.
* చీకటిపడ్డాక పెద్ద లైట్లు కాకుండా చిన్న సోలార్ లాంతర్లు వాడండి. వాటిని మొక్కల మధ్యన ఉంచితే ఇంకా మంచిది.



వైజయంతి మాల పాత్రలో

ఐదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత రకుల్‌ప్రీత్ సింగ్ టాలీవుడ్‌లో ఓ బంపరాఫర్ దక్కించుకున్నట్లు సమాచారం. లెజెండరీ సింగర్ ఎంఎస్ సుబ్బులక్ష్మి బయోపిక్‌లో ఈ ఢిల్లీ సుందరి కనిపించబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. వైజయంతి మాల పాత్ర కోసం రకుల్‌ను సెలెక్ట్ చేసినట్లు తెలిసింది. పాత్ర నిడివి తక్కువే అయినా కథలో కీలకంగా ఉంటుందని అంటున్నారు. గీతా ఆర్ట్స్‌తో పాటు అల్లు అర్జున్‌తో ఉన్న అనుబంధం కారణంగా రకుల్ ఈ సినిమాకు ఓకే చెప్పినట్లు వార్తలొస్తున్నాయి. ఈ సినిమాకు జెర్సీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నారు. డిసెంబర్ నుంచి ఈ బయోపిక్ షూటింగ్ ప్రారంభం కాబోతున్నట్లు టాక్ నడుస్తోంది.



రవితేజకు జోడీగా అనస్వర



ఇరుముడి తర్వాత క్రైమ్ కామెడీ జానర్‌లో మాస్ మహారాజా చేస్తున్న సినిమాలో రవితేజ సరసన అనస్వరరాజన్ నటిస్తోంది. తులాభారం పేరుతో తెరకెక్కుతోన్న ఈ సినిమా ఆదివారం లాంచ్ అయ్యింది. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ప్రియాంక మోహన్ మరో హీరోయిన్‌గా నటిస్తున్నారు. తరుణ్ భాస్కర్, జేడీ చక్రవర్తి కీలక పాత్రలు పోషించనున్నారు. తులాభారం ప్రారంభోత్సవ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ఈ లాంఛింగ్ ఈవెంట్‌లో రవితేజ, అనస్వర రాజన్‌లపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి హీరో శ్రీవిష్ణు క్లాప్ కొట్టారు. త్వరలో తులాభారం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కాబోతుంది. రవితేజ హీరోగా నటిస్తోన్న 78వ మూవీ ఇది.





కోలీవుడ్‌పై కన్నేసిన వైష్ణవి చైతన్య

బేబీ హీరోయిన్ వైష్ణవి చైతన్య రూటు మార్చింది. వరుస డిజాస్టర్లతో టాలీవుడ్‌కు బ్రేక్ ఇచ్చిన ఈ బ్యూటీ కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతుంది. హీరో ఆర్యతో ఓ రొమాంటిక్ కామెడీ సినిమా చేస్తోంది. వైష్ణవి చైతన్య డెబ్యూ మూవీకి హలో కాదల్ అనే టైటిల్ ఖరారైంది. వరుస పరాజయాలతో ఆఫర్లు తగ్గడంతో కోలీవుడ్ బాట పట్టింది. సైలెంట్‌గా ఓ సినిమా షూటింగ్ కూడా పూర్తిచేసింది. మలయాళ మూవీ ప్రణయ విలాసం ఫేమ్ నిఖిల్ మురళీ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ షూటింగ్ పూర్తయ్యింది. మోడ్రన్ అమ్మాయిగా బోల్డ్ రోల్‌లో వైష్ణవి చైతన్య కనిపించబోతున్నట్లు సమాచారం. ఈ సినిమా కోసం తమిళం నేర్చుకున్న వైష్ణవిచైతన్య సొంతంగా డబ్బింగ్ కూడా చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. డిసెంబర్‌లో ఈ అచ్చ తెలుగు బ్యూటీ తమిళ డెబ్యూ మూవీ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు సమాచారం.

ఓటీటీలోకి డోరతీ

కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటించిన బోల్డ్ మూవీ డోరతీ తమిళంలో సూపర్ హిట్‌గా నిలవగా తెలుగులో మాత్రం డిజాస్టర్ అయ్యింది. కాంట్రవర్షియల్ కాన్సెప్ట్‌తో రూపొందిన డోరతీ అక్టోబర్ 23 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతుంది. సొసైటీలో ట్రాన్స్‌జెండర్లు ఎదుర్కొంటున్న వివక్ష, కష్టాలతో దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు ఈ సినిమాను తెరకెక్కించారు. ఇళయరాజా సంగీతం అందించిన ఈ సినిమాలో రిషికాంత్, సనంద్ హీరోలుగా నటించారు. డోరతీ మూవీ టొరంటోతో పాటు పలు ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో స్క్రీనింగ్ అయ్యింది. గే కల్చర్‌ను ప్రోత్సహించేలా ఈ సినిమా ఉందంటూ మలేషియాతో పాటు మరి కొన్ని దేశాలు బ్యాన్ చేశాయి. తమిళనాడులోనూ ఈ సినిమాపై నిషేధం విధించాలంటూ గొడవలు జరిగాయి.

విజయ్ ఆంటోనీ సరసన హైదరాబాదీ బ్యూటీ



విజయ్ ఆంటోనీ హీరోగా నటించిన నాన్న కుట్టి మూవీ థియేటర్లలో సందడి చేయబోతోంది. ఈ సినిమాలో విజయ్ సరసన హైదరాబాదీ బ్యూటీ ప్రీతి అస్రానీ హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమా వచ్చే నెల 6న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ప్రీతి తెలుగు కంటే తమిళంలోనే ఎక్కువగా బిజీగా ఉంది. ఈ దీపావళికి నాన్న కుట్టి మూవీతో థియేటర్లలో సందడి చేయబోతుంది. అప్పా కుట్టి పేరుతో తమిళంలో రూపొందిన ఈ మూవీ తెలుగులోనూ విడుదల కాబోతుంది. తండ్రీకూతుళ్ల అనుబంధంతో రూపొందుతోన్న ఈ సినిమాను విజయ్ ఆంటోనీ భార్య మీరా విజయ్ ఆంటోనీ నిర్మిస్తుండగా, మారన్ దర్శకత్వం వహిస్తున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.